జనరాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచిక - 22 పక్షపత్రిక నవంబరు 16-30, 2010



## స్వేచ్ఛకు చిరునామా















తూర్పుగోదావరి జిల్లా,
కాకినాడ, దుమ్ములపేటలో
వరద ముంపుకు గురైన
బాధితులకి తమ వంతు
సహాయాన్ని అందించిన
లోక్‌సత్తా నాయకులు,
కార్యకర్తలు





మానవుని విలువలను ఆత్మగౌరవాన్ని హరించివేసే బానిసత్వాన్ని మించిన చెడు లేదు. తరతరాలుగా భారతీయ విద్యావిధానం కొద్దిమందిని మరింత విద్యావంతులుగా చేసి బహుజనులను, మహిళలను విద్యకు దూరం చేసి వారి దయకు వదిలివేసింది.

– జ్యోతిబా పూలే

## లోపలి పేజీల్లో...


ఆంగ్‌సాన్ సూచీ........................................5
సూక్ష్మరుణాలు ఆత్మహత్యల దారుణాలు...........7
రైతుల కష్టాలు, కడగండ్లు.............................8
రైతుల ఐక్యతాయాత్ర...................................10
గృహహింసపై రౌండ్‌టేబుల్...............................11
వేర్పాటువాదాన్ని మొగ్గలోనే తుంచండి...........12
కర్నాటకను చూసైనా నేర్చుకోండి..................13
రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి...........13
నల్గొండ రైతన్నలతో జేపీ...............................14
మెదక్ జిల్లా పర్యటనలో జేపీ..........................15
నిజామాబాద్ జిల్లా పర్యటనలో జేపీ...............19
14 ఎఫ్ తొలగించేలా ఢిల్లీపై ఒత్తిడి తేవాలి..... 20
పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో జేపీ...........21
ఖమ్మం జిల్లా పర్యటనలో జేపీ........................23
కర్ణాటక రాష్ట్రం సింధనూరు పర్యటనలో జేపీ. 24
నల్గొండ జిల్లా పర్యటనలో జేపీ........................26
తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో జేపీ...........28
జిల్లాల సమాచారం........................................32


# భారతీయ రైతుల్ని కాపాడండి

ఎగుమతుల్ని, తన దేశంలో ఉద్యోగావకాశాల్ని పెంచుకునే అజెండాను నెరవేర్చుకునేందుకు వినమ్రతతో భారతదేశ పర్యటనకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను చూసి భారతీయ నేతలు ఎందుకు నేర్చుకోరు. వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థికవ్యవస్థను కాపాడటం ద్వారా భారత ఆర్థిక రంగాన్ని స్థిరమైన అభివృద్ధిపథంలోకి తీసుకెళ్లి కోట్లాది ప్రజలకు ఉద్యోగాల్ని, జీవనోపాధిని అందించేలా ఎందుకు కృషి చేయరు. "ఒబామా నిజాయతీగా తన అజెండాను బైటపెట్టి అందుకోసం శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అందుకు ఆయన్ను మనం గౌరవించాలి. మనకు అసలు శత్రువులు మన నేతలే".

**సంపాదకీయం**

గ్రామీణ భారతదేశాన్ని నిర్లక్ష్యం చేస్తున్నంతకాలం సూపర్ పవర్ కావాలనే భారతదేశం కల నెరవేరదు. గ్రామీణులకు వ్యవసాయం తప్ప వేరే ఆదాయం లేదు. గ్రామప్రాంతాల ప్రజల కొనుగోలు శక్తి పెరగకపోతే భారతదేశం జీడీపీ 8 నుంచి 10శాతం వృద్ధిరేటును నిలబెట్టుకోలేదు.

రైతుల, కౌలుదారుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరను కల్పించటం వారి కొనుగోలు శక్తిని పెంచటానికి ప్రధానం. కానీ కేంద్రంలో, రాష్ట్రాలలో వరుస ప్రభుత్వాలు ద్రవ్యోల్బణాన్ని తగ్గించటం, వినియోగదారులను పరిరక్షించటం వంటి వంకల్ని చూపుతూ ఉద్దేశపూర్వకంగానే ఆహారధాన్యాల ధరల్ని అణగదొక్కాయి. ఎక్కువమంది ప్రజలు ప్రజాపంపిణీ వ్యవస్థ పరిధిలోకి వచ్చే ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో ధాన్యం సేకరణ ధరల్ని 40 నుంచి 50శాతం మేర పెంచటం వల్ల వినియోగదారులకు ఏమాత్రం నష్టం వాటిల్లదు. ధాన్యం రైతుకు క్వింటాలుకు రూ.1600 వరకూ ధర చెల్లించినా కూడా బియ్యాన్ని ప్రస్తుత మార్కెట్ ధరకే ఇవ్వవచ్చని లోక్‌సత్తా నిరూపిస్తుంది.

దేశంలోని చాలాప్రాంతాల్లో వ్యవసాయం పూర్తిగా రుతుపవనాల మీద ఆధారపడిన జూదంలా ఉంది. అందువల్ల ఈ రంగాన్ని మిగిలినరంగాలలాగా చూడటం తగదు. భారత వ్యవసాయరంగానికి అందిస్తున్న సరాసరి మద్దతు 30-40శాతం నెగెటివ్‌గా ఉందని, రైతుకు తగిన తోడ్పాటును ఇవ్వటంలేదని భారత ప్రభుత్వం స్వయంగా ప్రపంచ వాణిజ్య సంస్థకు తెలియచేసింది. అందుకు భిన్నంగా అమెరికా సహా అన్ని అభివృద్ధి చెందిన దేశాలూ నిబంధనలకు అతీతంగా కూడా (ఒక్కోసారి +40శాతం లేదా ఇంకా ఎక్కువ మేర కూడా) వ్యవసాయానికి సాయం అందిస్తున్నాయి.

వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను రక్షించేందుకు ప్రారంభమైన రైతు ఐక్యతా ఉద్యమ నాయకత్వానికి రైతుల్ని సన్నద్ధం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా లోక్‌సత్తా చేపట్టిన ఉద్యమం కేవలం రైతులు, కౌలుదారుల ప్రయోజనాలకే పరిమితం కాదు. అభివృద్ధికి గ్రామాన్ని కేంద్రబిందువు చేసి తద్వారా దేశాన్ని స్థిరమైన అభివృద్ధితో ముందుకు తీసుకెళ్లి అగ్రరాజ్యంగా తీర్చిదిద్దటమే లక్ష్యం. ★

**ఐకమత్యం ద్వారా చిన్న చిన్న రాజ్యాలు అభివృద్ధి చెందుతాయి. కాని ... విభేదాలు జనిస్తే పెద్ద పెద్ద దేశాలే సర్వనాశనమైపోతాయి**

– సాలస్ట్

**లోక్‌సత్తా టైమ్స్** - కొత్త రాజకీయ పక్షపత్రిక

*నవంబర్ 16-30, 2010 సంపుటి - 1 సంచికలు - 22*

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**

# స్పందన

*ఎడిటర్ గార్కి,*

లోక్‌సత్తా టైమ్స్ అక్టోబర్ సంచికలో శ్రీ బండారు రామ్మోహన్‌రావు గారు రాసిన ప్రత్యేక వ్యాసం తెలంగాణా సాయుధ పోరాటం 1944–51 చాలా చక్కగా ఉంది. ప్రతి విషయం కూలంకషంగా వ్రాయబడింది. రచయితకు, ప్రచురణకర్తలకు అభినందనలు. ఈ వ్యాసం చరిత్ర విద్యార్థులకే కాకుండా ఆంధ్రప్రదేశ్ పౌరులందరికీ మహోద్యమం పై చక్కటి అవగాహనను కలిగిస్తుంది. ఈ వ్యాసాన్ని ఒక చిన్న పుస్తకంగా తయారు చేసి కనీసపు ధరను నిర్ణయిస్తూ పుస్తక విక్రయకేంద్రాల్లో అమ్మించవచ్చును. లాభాపేక్ష కన్నా చదువరులను విద్యావంతులను చేయగల శక్తి ఈ వ్యాసానికి ఉన్నది.

నమస్కారములతో...

**పిడివి రామచంద్రుడు**
కాకినాడ

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

**జీవితంలో విజయాల్ని సాధించాలనుకుంటే మెట్ల వైపు చూస్తూ ఉండకుండా, మెట్లు ఎక్కుతూ పోవాలి**

– గాంధీజీ

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/ డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

**మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా**

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com

### లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**
ఫోటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# ఆంగ్‌సాన్ సూ చీ

ఆంగ్‌సాన్ సూచీ - మయన్మార్ సైనిక జుంటాకు ఎదురొడ్డి గత 20 సంవత్సరాల్లో 15 సంవత్సరాలు దుర్భర గృహ నిర్బంధంలో గడిపిన స్వేచ్ఛాకపోతం. నవంబర్ 13న విడుదలైన సందర్భంగా డా॥ జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయ మాలిక.... మీ కోసం...

## ఆమె విడుదలపై

ఆంగ్‌సాన్ సూచీ విడుదల ఎన్నో రకాలుగా సంతోషించదగ్గ అంశం.. ఎందుకంటే నెల్సన్ మండేలా విషయంలో ప్రపంచం మొత్తానికి ఒక స్పష్టత వుంది. దక్షిణాఫ్రికాలో కేవలం రంగు కారణంగా నల్లజాతి వారిని అవమానించడం, బానిసలుగా చూడటం, వర్ణవివక్షత (apartheid) దారుణం, అమానుషం, నాగరిక ప్రపంచం దీన్ని అంగీకరించకూడదన్న స్పష్టమైన అవగాహన వుండింది. కానీ ఆంగ్‌సాన్ సూచీ విషయంలో అది ఒక దేశంలో ఒక జాతి వాళ్ళు అదే జాతి వాళ్ళను హింసిస్తూ, జైళ్ళలో పెట్టి, స్వేచ్ఛని హరించి వేస్తే దాన్ని ఒక తీవ్రమైనటువంటి నైతికాంశంగా ప్రపంచ సమాజం తీసుకోవటం లేదు.

ఇక ప్రపంచంలో ఆర్థికంగా, సైనికపరంగా నియంతృత్వ చైనా ఒక ప్రబలమైన దేశంగా వేగంగా ఎదుగుతున్న దశలో మనం మయన్మార్ (బర్మా)లో వున్న సైనిక నియంతృత్వ ప్రభుత్వంతో విరోధం తెచ్చుకుంటే చైనా మయన్మార్‌ని ఉపయోగించుకుని మనల్ని కాని, ఇతర ఆగ్నేయాసియా దేశాల్ని కాని ఇబ్బంది పెట్టి మనదేశ ప్రయోజనాలకి భంగం కలిగించే అవకాశం వుంది. ఆ కారణంగా జరుగుతున్నవి తప్పు అని తెలిసి కూడా 'ఆ దేశంలో ప్రజాస్వామ్యం కావాలి. స్వేచ్ఛ అందరికీ వుండాలి అని చెప్పలేని నిస్సహాయ స్థితి మనది ఇతర ఆగ్నేయ ఆసియా దేశాలది. ఈవేళ అంతర్జాతీయ దౌత్యనీతిలో ఏ దేశమైనా తన దేశ, జాతి ప్రయోజనాల కోసం పోరాడుతుంది కాని, ప్రపంచంలో గొప్ప విలువల కోసం పోరాడటం అరుదుగా జరుగుతుంది.

గత 20 ఏళ్ళలో 15 ఏళ్ళు గృహ నిర్బంధానికి గురై విపరీతమైన వ్యక్తిగత క్లేశవానికి గురై, కుటుంబంతో వుండే అవకాశం లేకుండా, ప్రేమించి పెళ్ళాడిన భర్తను కోల్పోయి, పిల్లలకు దూరంగా బ్రతకాల్సి రావడం దారుణం. ఆమెకి ప్రసాదించిన స్వేచ్ఛ ఎంతకాలం వుంటుందో తెలియదు కాని ఇప్పటికైనా స్వేచ్ఛని ప్రసాదించటం సంతోషించదగ్గ విషయం.

అయితే ఇంతమాత్రం చేత బర్మాలో పరిస్థితులు బాగుపడతాయన్న నమ్మకం లేదు. అలాగే ప్రపంచంలో కూడా దీని పట్ల ఒక నైతికపరమైన ఒత్తిడులు తెచ్చే భావనలు కనిపించడం లేదు. ఇది చాలా దురదృష్టకరం.

## సూచీ భవిష్యత్ కార్యచరణపై...

ప్రస్తుతం ఆమె ముందు మూడు రకాల సమస్యలున్నాయి. **మొదటిది:** దాదాపు 2000 మందికి పైగా ఆ దేశ ప్రజాస్వామ్యం కోసం పోరాడిన యోధులు ఆ దేశం జైళ్ళలో మగ్గుతున్నారు. ఆమెకు మాత్రమే స్వేచ్ఛ వుండి ఆమె సహచరులకి స్వేచ్ఛ లేనట్లయితే ఆమె ఏమీ చేయడం సాధ్యం కాదు. ఆమెకు ధర్మమూ కాదు. కాబట్టి వారందరినీ విడుదల చేయించాలి.

**రెండవది:** ఈ మధ్య ఆ దేశంలో ఎన్నికలు జరిగాయి. అవి వట్టి బూటకపు ఎన్నికలు. ఆంగ్‌సాన్ సూచీ లేకుండా ఎన్నికలు జరపాలన్న దురుద్దేశంతో ఎన్నో తప్పుడు ఆరోపణలతో ఆమెను ఎన్నికల్లో పాల్గొనకుండా అనర్హురాలిని చేసి తమ కనుసన్నల్లో వుండే ప్రభుత్వాన్ని బూటకపు ఎన్నికల ద్వారా ఏర్పాటు చేసారక్కడి మిలటరీ పాలకులు. ఆ ప్రభుత్వం ఏవో ఒక ఎన్నికల్లో ఎన్నికయ్యింది. కాబట్టి కొద్దిపాటి ఇంగితజ్ఞానం, చిత్తశుద్ధితో ప్రజాస్వామ్యం కోసం పాటు పడితే సూచీ ఆ ప్రభుత్వానికి సహకరించాల్సి వుంటుంది. అలా కాక అది పూర్తిగా సైనిక నియంతృత్వం అదుపాజ్ఞల్లో కీలుబొమ్మలా వుండి ప్రజల్ని అణగద్రొక్కితే దాన్ని ఎదురించాల్సి వుంటుంది. కాబట్టి పరిణామాల్ని బట్టి ఆమె కాని ఆమెతోటి ప్రజాస్వామ్యవాదులు కాని వ్యవహరించాలి.

**మూడవది:** ఇంకో ప్రమాదం పొంచి వుంది. ఇప్పుడు వదిలిపెట్టిన వాళ్ళే మళ్ళీ ఆమెను గృహ నిర్బంధంలోకి తీసుకొని మరో 5 ఏళ్ళో, 10 ఏళ్ళో జైల్లో పెడితే ప్రపంచం ఆమెని మర్చిపోతుంది కూడా.. నెల్సన్‌మండేలాకు జాతి వర్ణ వివక్షతకు వ్యతిరేకంగా, స్వేచ్ఛకు, నైతికమైన పోరాటానికి చిహ్నంగా గుర్తింపు వచ్చింది. అంతేస్థాయి, త్యాగం గొప్ప లక్షణాలు వున్నా, వర్ణవివక్ష లాంటి గొడవలు లేవు కాబట్టి సైనిక నియంతృత్వానికి ప్రజాస్వామ్య వాదులకి మధ్య జరుగుతున్న గొడవగా ఆ దేశ అంతర్గత వ్యవహారంగా, నైతికంగా అంత బలవ్మైన కారణంగా భావించకపోవడం వల్ల ఆమె కోసం ఏమైనా చేస్తాం అనే వాళ్ళు ప్రపంచ దేశాల్లో ఎక్కువగా లేకపోవడం వల్ల ఆమెని మళ్ళీ జైల్లో పెట్టే ప్రమాదం వున్నది. అలాగని ఆమె రాజీ పడటం సాధ్యం కాదు. అదే సమయంలో దుందుడుకు వైఖరితో మరో పదేళ్ళు జైల్లో వుండటం వల్ల ఆ దేశానికి ఏమీ ప్రయోజనం వుండదు

కాబట్టి సూచీ చాలా ఒడుపుగా వ్యవహరించవలసి వుంటుంది.

భారత, జపాన్, అమెరికా, ఇతర ఆగ్నేయ ఆసియాదేశాలకు మయన్మార్ మిలట్రీ ప్రభుత్వంపై ఎంతో కొంత ప్రభావం చూపే అవకాశం వుంది. ప్రపంచ దేశాలు, మనం కూడా మన పరిధుల్లో వత్తిడి తీసుకువచ్చి ఆ దేశంలో క్రమక్రమంగా ప్రజాస్వామికీకరణ జరగడం భవిష్యత్తులో నిజమైన ఎన్నికలు జరిగేలా ఏర్పాటు చేయడం లాంటి వాటికి పూనుకోవాలి. దీనికి అంతర్గతంగా సూచీ తదితర ప్రజాస్వామ్యవాదుల పోరాటం తోడైతే కొద్ది సంవత్సరాల తరువాత అయిన బహుశా సూచీ కోరుకునే ప్రజాస్వామ్యాన్ని మనం ఆ దేశంలో చూడవచ్చు.

## ఆమె స్ఫూర్తిగా...

ఈ వేళ ప్రపంచంలో బ్రతికి వున్న మహనీయుల్లో నెల్సన్‌మండేలాతో పోల్చదగ్గ, కొన్ని విషయాల్లో మరింత గౌరవానికి అర్హమైనటువంటి అత్యున్నత మహిళ ఆంగ్‌సాన్ సూచీ. నెల్సన్‌మండేలాను జైల్లో పెట్టిన తరువాత ఆయన ఆరోగ్యాన్ని, మనసుని కాపాడుకోవడం, తెల్లవారిపట్ల ద్వేషాన్ని జయించడం, గాంధీ మార్గంలో ఆర్ద్రతతో కూడినటువంటి ప్రేమను అలవరుచుకోవడం మేరకే ఆయన చేయవలసింది. కానీ సూచీ తను ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్త క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చనిపోతున్నా, ఇక దీన్ని భరించలేను, భర్తతో కలిసి వుంటాను అనుకున్న మరుక్షణం మిలిటరీజుంటా ఆమెను బర్మా నుండి పంపించి వుండేవాళ్ళు. అలాగే భారత్‌లో నెహ్రూ అవార్డును తీసుకోవడానికి ఢిల్లీ వస్తానన్నా సంతోషంగా స్వేచ్ఛను ప్రసాదించేవారు. కాని తిరిగి బర్మా దేశానికి రానిచ్చేవారు కాదు. ఏ క్షణమైనా సరే, ఆ చెర నుండి బయటకు పోవడమేనేది పూర్తిగా ఆమె చేతుల్లో వుండింది. కాని దాన్ని జయించి ప్రపంచమంతా పట్టించుకోకపోయినా, ఒంటరితనం బాధిస్తున్నా, ప్రేమించిన భర్త మరణించినా, నిరాశకు, ప్రలోభానికి లొంగకుండా తన మాతృదేశం కోసం, దేశ ప్రజల స్వేచ్ఛ కోసం అన్నింటినీ అర్పించి పోరాడిన మహిళ ఆంగ్‌సాన్ సూచీ. అసాధారణమైన త్యాగం అమెది. ఆమె మానసిక స్థైర్యం, ద్వేషరహిత మనస్తత్వం, తన జీవితాన్ని, దేశాన్ని నాశనం చేసిన, చేస్తున్న శత్రువులను పల్లెత్తు మాట అనని నైజం, చేస్తున్న తప్పును వారించటమే తప్ప అసహనం, కోపం, ద్వేషం వెలిగక్కకపోవడం ఆమె వ్యక్తిత్వ లక్షణాలు.

**మహాత్మాగాంధీ తత్వాన్ని పూర్తిగా అలవరుచుకుని, ఆచరిస్తున్న ఆంగ్‌సాన్ సూచీ ఈ శతాబ్దపు మహనీయురాలు.**

నాతో సహ ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛని కోరుకునే వారందరి పై చరిత్రలో వాటి కోసం పోరాడిన మహనీయుల జీవితాలు, త్యాగాలు ఆలోచనల ప్రభావం చాలా బలంగా వుంటుంది. మయన్మార్‌తో పోల్చితే మన దేశ పరిస్థితులు ఎన్నో రకాలుగా మెరుగ్గా వున్నాయి. ఎంత లోపభూయిష్టమైనా చట్టబద్ధంగా జరుగుతున్న ఎన్నికలున్నాయి. ప్రభుత్వం వుంది. ప్రజాస్వామ్యం వుంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వ్యవస్థలు వున్నాయి. అయినా, మనలో నిస్పృహ చెందే వారికి ఆంగ్‌సాన్ సూచీ జీవితం, పోరాటం కనువిప్పు కావాలి. ఆమె నుండి పొందే స్ఫూర్తి మనల్ని మరింత చైతన్యశీలురుగా పోరాటయోధులుగా తీర్చిదిద్దాలి. మెరుగైన ప్రజాస్వామ్య విలువల కోసం, స్వేచ్ఛ కోసం మనం చేసే పోరాటంలో మరింత ఉత్తేజితులం కావాలి.

## సూ చీ పొందిన అంతర్జాతీయ అవార్డులు

1990 – తోరోల్ఫ్ రాఫ్తో స్మారక బహుమతి
1990 – సఖరోవ్ బహుమతి
1991 – నోబుల్ శాంతి బహుమతి
1992 – సైమన్ బొలివర్ అంతర్జాతీయ బహుమతి
1993 – జవహర్‌లాల్ నెహ్రూ బహుమతి (ఇంటర్నేషనల్ అండర్‌స్టాండింగ్)
1995 – లిబరల్ అంతర్జాతీయ స్వేచ్ఛా బహుమతి
1996 – గౌరవనీయ కంపానియన్ ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా
1999 – ఫ్రీడమ్ ఆఫ్ డుబ్లిన్ నగరం, ఐర్లాండ్
2000 – ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్
2002 – యునెస్కో మదన్‌జీత్ సింగ్ బహుమతి (సహనం, అహింసా వ్యాప్తికి)
2004 – గ్వాంగ్‌జు బహుమతి (మానవ హక్కులు)
2004 – మెమోరియల్ యూనివర్శిటీ, న్యూఫౌండ్‌ల్యాండ్ నుండి డాక్టర్ ఆఫ్ లాస్
2005 – ఓలోఫ్ పామే బహుమతి
2006 – ఫ్రీడమ్ ఫ్రమ్ ఫియర్ అవార్డు
2007 – గౌరవ కెనడా పౌరసత్వం
2007 – ఎల్ఎస్ఇఎస్‌యు గౌరవ అధ్యక్ష పదవీ
2008 – కాల్గేట్ యూనివర్శిటీ నుండి డాక్టర్ ఆఫ్ లెటర్స్
2008 – కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్
2008 – ప్రేమి ఇంటర్నేషనల్ కెటలున్యా
2008 – మ్యాడ్రిడ్ క్లబ్ గౌరవ సభ్యత్వం
2009 – ఫ్రీడమ్ ఆఫ్ గ్లాస్‌గౌ
2009 – మహాత్మాగాంధీ అంతర్జాతీయ బహుమతి (పీస్ & రీకాన్సిలియేషన్)
2009 – మానవ హక్కుల పరిరక్షణకై చేసిన సేవలకుగుర్తింపుగా ఉల్‌స్టర్ యూనివర్శిటీ నుండి గౌరవ డాక్టర్ ఆఫ్ లాస్
2009 – అమ్నెస్టి ఇంటర్నేషనల్ నుండి అంబాసిడర్ ఆఫ్ కాన్‌సైన్స్ అవార్డు

# సూక్ష్మరుణాలు - ఆత్మహత్యల దారుణాలు

**- డి.వి.వి.యస్.వర్మ**

ఇప్పుడు రాష్ట్రంలో సూక్ష్మరుణాల ఆత్మహత్యల పర్వం సాగుతున్నది. అప్పుల ఊబిలో చిక్కుకున్న నిరుపేదలు సూక్ష్మరుణ సంస్థల వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పత్రికలు, ఛానళ్లు ఈ దారుణాలను వెలికి తెచ్చిన తర్వాత, ప్రభుత్వం ఆర్డినెన్సు తెచ్చిన తర్వాత కూడా ఇవి కొనసాగడం దారుణం.

సూక్ష్మరుణాలు పేదలకి ఇచ్చే రుణాలు. వాళ్ల అవసరాలకి, ఆర్థిక స్వావలంబనకీ దోహదపడాల్సిన రుణాలు. ఆత్మ గౌరవంతో తలెత్తుకు తిరగడానికి సహాయ పడాల్సిన రుణాలు, కానీ ఆచరణలో అవి విరుద్ధ ఫలితాలను ఇస్తున్నాయి. సూక్ష్మరుణ సంస్థల వడ్డీ దాహానికి లాభాల వేటకి పేదలు బలిపశువులవుతున్నారు.




పేదలకు అప్పులిచ్చే వాళ్ళు అరుదు, అవసరాల కోసం ఇంటి ముంగిట అప్పులిచ్చే సంస్థలు వెలిస్తే వారికి అంతకంటే కావల్సింది వుండదు. సూక్ష్మరుణ సంస్థలు ఈ పరిస్థితిని గమనించాయి. ఇక్కడి అవకాశాలను పసిగట్టాయి. అడగకుండానే అప్పు ఇచ్చే దాతలుగా ఈ రాబందులు వాలుతున్నాయి. కనిపించని వడ్డీ భారాన్ని వారం వారం వసూళ్ల రూపంలో వడ్డీకి వడ్డీ రూపంలో, సకాలంలో కట్టకపోతే జరిమానాల రూపంలో అసలుకు నాలుగు అయిదు రెట్లు చెల్లించినా అప్పు మాత్రం తీరని పద్ధతిలో వారిని పీల్చి పిప్పి చేస్తున్నాయి. అప్పులు చెల్లించకపోతే, వాయిదా మీరితే ఈ కాబులీవాలాలు బండ బూతులు తిడతారు అవమానిస్తారు. వేధిస్తారు. అంతిమంగా అప్పు కట్టలేకపోతే బతికి వుండి కట్టలేవుగాని చస్తే బీమాతో చెల్లిపోతుందని ఆత్మహత్యలకు పురికొల్పుతున్నారు. ఇది వాళ్ల అమానుష నినాదం. అందుకే సూక్ష్మరుణ గ్రహీతలు విముక్తి కోసం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

మనకి జాతీయ బ్యాంకులున్నాయి. వాటి దగ్గర కోటాను కోట్లు మూలుగుతున్నాయి. అతి తక్కువ వడ్డీకి డిపాజిట్లు నిర్వహిస్తున్నాయి. అవి జాతీయకరణ నినాదాన్ని తుంగలోకి తొక్కాయి. కొద్ది మందికి కోట్ల రుణాలు ఇవ్వడానికి ముందుకొస్తున్నాయి. ఎగ్గొట్టినా తేలుకుట్టిన దొంగలా కిమ్మనడం లేదు. కానీ పేదలకి రుణాలివ్వడానికి వాళ్లకి మనసు ఒప్పడం లేదు. ఇన్ని లక్షల మందికి అప్పులిస్తే ఇన్ని ఖాతాలను నిర్వహిస్తే పని భారంగా భావిస్తున్నాయి. అందుకే అవి గ్రామీణ ప్రాంతాలకి ఇవ్వాల్సిన రుణాల కోటాలో ఈ సూక్ష్మ రుణసంస్థలకి గుత్తగా రుణాలు ఇచ్చేసి తమ పని అయిందనిపించుకుంటున్నాయి. జాతీయ బ్యాంకుల చేతగానితనాన్ని సూక్ష్మ రుణసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఈ సంస్థల స్వంత పెట్టుబడి 10 శాతం కూడా ఈ 10,000 కోట్లలో లేదు బ్యాంకుల నుండి తీసుకుని చక్రవడ్డీలతో పేదల్ని కొట్టి కోట్లు దండుకుంటున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఒక ఆర్డినేన్సును తెచ్చింది అది వడ్డీని నియంత్రించడం తన పరిధిలోకి రాదని వదిలేసింది. కేంద్రప్రభుత్వం మాత్రం వడ్డీకి పరిమితి పెట్టాలని రిజర్వు బ్యాంకుకు సూచించింది. రిజర్వు బ్యాంకు అది సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ఆత్మహత్యల నేపథ్యంలోనైనా రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. 24 శాతం వడ్డీకి మించకుండా, చక్రవడ్డీకి తావు లేకుండా, నెలవారీ వసూళ్లు వుండేలా, ఒకరికి ఒకటి రెండు సంస్థలు మించి అప్పులు ఇవ్వకుండా కట్టడి చెయ్యాలి. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరుస్తుందని కళ్లెర్ర చేస్తుందని ఆశిద్దాం. ★

# రైతులకు మిగులుతున్నది అప్పులు అనారోగ్యం, కష్టాలు కడగండ్లు

- జగన్నాధనాయుడు

63ఏళ్ళ స్వాతంత్ర్యంలో రైతులకు మిగిలింది కష్టాలు, కడగండ్లు, కన్నీళ్ళు మాత్రమే. పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ భారతం వెలవెల పోతున్నది. పట్టణ భారతం మాత్రం వెలిగిపోతున్నది. దళారులు, పాలకులు, రాజకీయ నాయకులు, పారిశ్రామిక సంస్థలు, కోటీశ్వరులు, వ్యాపారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లందరూ సర్వసుఖాలు అనుభవిస్తున్నారు. అయితే రైతులు మాత్రం రేయింబవళ్లు కష్టపడుతూ ఆర్థికంగా చితికి, కృంగి కృశించిపోతున్నారు. దేశ ప్రజలందరికీ ఆహార పదార్థాలు అందిస్తున్న రైతులు తీవ్ర అవమానాలు, ఆత్మహత్యలు, కష్టాలు, కడగండ్లు, కన్నీళ్ళుతో కడతేరిపోతూనే ఉన్నారు. అయినా కూడా రైతులను నంజుకుతింటున్న సంపన్న వర్గాలు మాత్రం సర్వభోగాలు అనుభవిస్తున్నారు. రైతులు పండించే ఉత్పత్తులను ముట్టుకోకుండా ఒక్కరోజు కూడా ఏ ఒక్కరు బ్రతకలేని పరిస్థితి ఉన్నప్పటికీ, అన్నదాతల కష్టనష్టాలు గురించి పట్టించుకునే పాలకులు కానీ, అధికారులు కాని మనకు కరువయ్యారు.

అందరూ రైతు భజన చేసేవారే, అయినా దోపిడీ మాత్రం ఆగడం లేదు. అందరికీ స్వాతంత్ర్యం వచ్చిందే కాని (అన్నదాతకు) రైతాంగానికి మాత్రం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లేకుండా పోయింది. పారిశ్రామికవేత్తలు మాత్రం తన వస్తువులను ప్రపంచంలో ఎక్కడయినా, ఎంత రేటుకైనా అమ్ముకోవచ్చు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు మాత్రం అలాంటి స్వేచ్ఛ అవకాశాలు లేవు. ఇటీవల ముంబాయిలో వందమంది చనిపోతే దేశం అట్టుడికిపోయింది. అయితే గత పదేళ్ళకాలంలో రెండు లక్షల మంది రైతులు ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలు చేసుకుంటే స్పందించిన మహానుభావులు లేరు. ఈ దేశంలో మిగతా వారి ప్రాణాలకు ఉండే విలువ అన్నంపెట్టే అన్నదాతల ప్రాణాలకు లేకుండా పోయింది. రైతుల విషయంలో రాజకీయ పార్టీలు వేరైనా పాలకులంతా ఒక్కటే కానీ, రైతులు మాత్రం తమ సమస్యలను గురించి నిలదీయడంలో అందరికీ పెన్షన్ సౌకర్యం, సామాజిక భద్రతలో భాగంగా వర్తిస్తుంది. కానీ, రైతులకు మాత్రం ఆ సౌకర్యం లేదు. పారిశ్రామిక ఉత్పత్తులకు ఉండే ఇన్సూరెన్స్ సౌకర్యం వ్యవసాయ ఉత్పత్తులకు లేదు. నిన్నగాక మొన్న వరదలు, వానలు, కరువు కాటకాలతో పంటలు నష్టపోయినా పట్టించుకున్నవారే కరువయ్యారు. రైతు పండించిన పంట చేతికి రాగానే దాని వెల రూపాయి. అదే పట్టెడన్నం పెట్టే శ్రమదాత వస్తువు దళారీల చేతిలోకి చేరితే ఆ వస్తువు వెల మూడు రూపాయలకు అమ్ముడవుతుంది.

1970లో ఒక కొబ్బరికాయకు ఒక లీటరు పెట్రోలు వచ్చేది. ఇప్పుడు పది నుంచి 15 కొబ్బరి కాయలకు కూడా ఒక లీటరు పెట్రోలు రాదు.

తాగేనీరు లీటరు ఒకటికి 14 రూపాయలు. అయితే రైతు తీసుకొచ్చే ఒక లీటరు పాల ధర పన్నెండు రూపాయలు

రైతు ఒక పశువు మీద ఏటా 20 వేల రూపాయలు నష్టపోతున్నాడు. వినియోగదారుడు మాత్రం లీటరు పాలకు 35 రూపాయలు చెల్లించాలి. ఒకనాడు 25 పైసలున్న కొబ్బరి కాయ ఇప్పుడు ఆరు రూపాయల నుండి పది రూపాయలు, పది పైసలున్న మజ్జిగ రెండు రూపాలయకు పెరిగితే 25 పైసలు ఉన్న కూల్‌డ్రింక్ 15 రూపాయలకు పెరిగింది.

కొబ్బరికాయ, మజ్జిగ దివ్య ఔషధమైనా ఇవి రైతులకు సంబంధించిన ఉత్పత్తులు గనుకనే పెద్దగా రేట్లు పెరగలేదు. అదే క్రిమి సంహారకాలతో కూడిన కూల్‌డ్రింకులు మాత్రం ఎన్నో రెట్లుగా ధరలు పెరిగాయి.

రైతులు పండించిన చెరకుకు ఫ్యాక్టరీలు ఇచ్చేది కిలోకు రూ. 2.00 రూపాయలు మాత్రమే. అదే రసం తీసిన పిప్పిని మాత్రం చక్కెర ఫ్యాక్టరీలు కిలో 1.50 పైసలుకు అమ్ముకుంటాయి.

బంజరు భూములలో పెరిగే కంపకట్టె టన్ను మూడువేల రూపాయలు. అయితే రైతు అహోరాత్రులు కష్టించి పండించే చెరకు ధర మాత్రం టన్నుకు 2, 200 రూపాయలు కూడా రావడం లేదు.

రైతు నుంచి డెయిరీలు కొనుగోలు చేసే పాల నుండి వెన్న తీసి, ఆ పాలను రూ.24లకు అమ్ముకుంటారు. అదే రైతులకు మాత్రం పాల ఫ్యాక్టరీలు 12 రూపాయలు ధర ఇవ్వడం లేదు.

రైతుకు కిలో మిరపకాయలకు దక్కేది రూపాయి మాత్రమే. అదే మిరపకాయలను పొడి చేసి రూ. 150.00 లకు అమ్ముకుంటున్నారు. మార్కెట్‌లో కిలో బియ్యం రూ.35 లు, అదే బియ్యం పండించిన రైతుకు దక్కేది మాత్రం రూ.12 రూపాయలు మాత్రమే.

ఆరు నెలల కష్టానికి కిలోబియ్యం మీద రైతుకు దక్కింది 12 రూపాయలు, అయితే చేతులు మార్చిన దళారీలకు మాత్రం రూ॥ 23 రూపాయలు దక్కుతోంది.

ఒక చిన్న స్థాయి ఉద్యోగి ఆదాయం ఏటా రూ. 1,20,000 లు వస్తుంది. అయితే, పది ఎకరాలు ఉన్న రైతుకు ఏటా ఖర్చులు పోనూ రూ.25,000లు కూడా దక్కడం లేదు. ఒక ఎకరా వరి పంటపై ఖర్చులు పోనూ రైతుకు రూ.2,500లు మాత్రమే మిగులుతుండగా, ఆ పంటపై దళారీలకు మాత్రం రూ.40,000లు మిగులుతుంది.

1980 సంవత్సరములో రూ.250 లు జీతగాడు రూ. 25,000లకు పెరిగాడు. అప్పట్లో ఎమ్మెల్యే జీతం ఐదువందల రూపాయలు అయితే, ఇప్పుడు రూ. 50 వేలకు పెరిగింది. రైతులకు మాత్రం అప్పట్లో ధాన్యం ఎకరాకు ఖర్చులు పోనూ 15 క్వింటాళ్ళు మిగిలేది. కాగా ఇప్పుడు రైతుకు రెండు మూడు క్వింటాళ్ళు కూడా మిగలడం లేదు.

ప్రాజెక్టులు, డెల్టా కాలువలను ఓ వైపు స్వయంగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మిస్తుండగా మరో వైపు బావులను, బోరులను రైతులు మాత్రమే తవ్వుకోవాల్సి వస్తున్నది. డెల్టాల కింద రైతులకు పంటకు మాత్రమే పెట్టబడి పెట్టాల్సి వస్తున్నది. అందుకే రైతు అప్పుల పాలవుతున్నాడు. రాష్ట్రం కేంద్రప్రభుత్వ విధానాలయి పారిశ్రామిక వేత్తలు కోటానుకోట్లకు పడగలెత్తుతున్నారు. అదే పాలకులు కారణంగా రైతు బతుకు క్షీణించి దివాళాకు గురవుతున్నారు. రైతులు పిల్లల పెళ్ళిళ్ల కోసమో, తమ బిడ్డల చదువుల కోసమో, ఇల్లు కట్టుకోవడానికో, ఆస్తి పాస్తులను కూడబెట్టుకోవడానికో అప్పులు చేయడం లేదు. రైతాంగాన్ని ఆదుకోలేని పాలకుల నీచ నికృష్ట విధానాల కారణంగానే అప్పులపాలై వారి విధానాలతో రైతు బలవుతున్నాడు.

పరిశ్రమలకైతే అన్ని రకాల ప్రమాదాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుంది. రైతులకు మాత్రం వరదలు, కరువు కాటకాలు, అగ్నిప్రమాదాలు, బావులు, బోరులు, ఎండిపోయినప్పుడు మోటార్లు కాలిపోయినప్పుడు ఎలాంటి ఇన్సూరెన్స్ సౌకర్యం ఉండడం లేదు. అందుకే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

దేశంలోని ఇతర రాష్ట్రాలలో టన్ను చెరకు రూ.2200 నుంచి 2600 వరకు ఫ్యాక్టరీలు చెల్లిస్తుండగా, రాష్ట్ర రైతాంగానికి మాత్రం రూ.2000 కూడా దక్కడం లేదు. రాయలసీమ, తెలంగాణా జిల్లాల్లో చెరకు రైతుల పట్ల చిన్నచూపు చూడడం విశేషం.

ప్రతి ఎకరాలో ఒక పంటకు ధాన్యం పండించిన రైతు రూ.40,000/- నూనె విత్తులు పండించిన రైతు 25,000/- చెరకు పండించిన రైతు రూ.35,000, మిరప రైతు1,00,000/- రూపాయలు చొప్పున నష్టపోతున్నారు. అందుకే ఆర్థికంగా రైతులు కోలుకోలేక పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇందుకు ప్రధాన కారణం మధ్య దళారీలు, వారిని ప్రోత్సహిస్తున్న పాలకవర్గాలు మాత్రమే. అందుకే రైతులకు జరుగుతున్న ఇటువంటి నష్టాలను ప్రభుత్వమే భరించాలి.

బంగారం, వజ్రాలు, షేర్ల బదిలీపై అర (1/2) శాతం నుంచి ఒక (1) శాతం మాత్రమే పన్ను వుంది. అయితే రైతు పండించిన బియ్యంపై ప్రభుత్వం విధించే పన్ను 11 శాతం. అదే విధంగా రైతు పొలాల్లో పండించే అన్ని వ్యవసాయ ఉత్పత్తులపై పన్నులు విధించి పాలకులు తమ పక్షపాత ధోరణిని రైతులపై చూపిస్తున్నారు.

20 ఏళ్ళలో రైతులకు జరిగిన రుణమాఫీ 57 వేల కోట్ల రూపాయలు మాత్రమే. అదే పారిశ్రామిక వేత్తలకు ఇచ్చిన రాయితీలు, రుణమాఫీ అయితే 7 లక్షల కోట్ల రూపాయలు.

కేంద్ర ప్రభుత్వం కూల్‌డ్రింక్ కంపెనీలు, స్వీటుషాపులు, ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీలకు అతి తక్కువ రేటుకే చక్కెరను సరఫరా చేస్తోంది. ఒక వైపు పండిన పంటలో రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా మరోవైపు చక్కెరలో 80 శాతాన్ని తక్కువ ధరకు ఇవ్వడం న్యాయమనే పాలకుల అడ్డదిడ్డమైన వాదన ప్రబలంగా ఉంది.

మనదేశ ఆదాయంలో 70 శాతం వ్యవసాయ రంగం నుండే ఆదాయం వస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రెండు శాతం నిధులను కూడా ఖర్చుపెట్టడం లేదు.

ప్రజా ప్రతినిధులు 70 శాతం వ్యవసాయ కుటుంబాల నుండి వచ్చిన రైతు బిడ్డలే. అయితే పదవులను చేపట్టిన వారు చట్టసభలలో ఒక్క రోజు కూడా అన్నదాతల గురించి మాట్లాడిన వారు కనపడలేదు.

**ఓ రైతన్నలారా! మీకిది అన్యాయం అనిపించడం లేదా? ఈ అన్యాయం పట్ల మీకు కడుపుమండటం లేదా?** రైతుల రక్తాన్ని పీల్చే ఇటువంటి పాలకుల విధానాలను మనం ఇంకా ఎంత కాలం భరించాలి. పాలకుల కోసం రైతులు ఎందుకు ఆత్మత్యాగం చేయాలి. స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి జై జవాన్... జై కిసాన్ అంటూ శ్లాఘించిన మరుసటి సంవత్సరం నుంచి తర్వాత రైతులను గురించి పట్టించుకునే పాలకులు, నాయకులు, అధికారులు కరువయ్యారు. ఎన్నికలు వస్తున్నాయి, పోతున్నాయి. అయితే ప్రజా ప్రతినిధులుగా పోటీచేసేవారు మీ వద్దకు వచ్చినప్పుడు రైతులు తమ సమస్యలపై నిలదీయడం లేదు. రైతులకు వారు ఏమి చేస్తారో అడగడం లేదు. వచ్చే ఎన్నికలలోగా అన్నదాతలు ఐక్యంగా సంఘటితమై తమ ప్రతినిధులను తామే గెలిపించుకునేలా రైతు సత్తా చాటితేనే వ్యవసాయ రంగం మనుగడ ఉంటుంది. లేదంటే భావితరాలు కూడా ఇప్పటి కష్టాన్ని నష్టాన్ని చవి చూడవలసివస్తుంది. రైతన్నలారా ఏకం కండి. మనమే ఓ సంఘం ఏర్పరచుకుందాం, ఊరూరా, మండలాల వారీగా, జిల్లాల వారీగా రాష్ట్ర స్థాయి కమిటీలు నిర్మించుకొని ఉమ్మడి ప్రయోజనం కోసం ఉద్యమిస్తేనే రైతోన్నత భవిష్యత్తు. ★

# రైతుల ఐక్యతా యాత్ర

**1. పూర్వరంగం :** డా॥ జయప్రకాష్ నారాయణ్ గారు రైతులలో ఐక్యతను సాధించడానికి చేపట్టిన గ్రామ సందర్శన కార్యక్రమం రైతుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఐక్యతానినాదాన్ని గ్రామ గ్రామానికి విస్తరింప చెయ్యాలి. ఎవరి రాజకీయం వారు వుంచుకుంటూనే లాభసాటి వ్యవసాయం కోసం రైతులంతా సంఘటితం కావాలన్న నినాదాన్ని రైతుల దగ్గరకు తీసుకువెళ్లాలి. గ్రామాలలో అందరి రైతులతో "రైతువేదిక" ను రూపొందించుకుని సంఘటిత పడేలా ప్రోత్సహించాలి.

**నవంబరు 20 నుండి 30 వరకు "రైతుల ఐక్యతా యాత్ర"**

**2. యాత్రా బృందం :** 4 మండలాలను క్లస్టరుగా ఎంచుకోవాలి. మండలం ప్రాతిపదికగా ఈ యాత్ర నిర్వహించాలి.

✸ ప్రతి బృందంలో ఒకరు జిల్లా పార్టీ ప్రతినిధి, ఒకరు స్థానిక మండల ప్రతినిధి సభ్యులుగా వుండాలి. ఈ బృందానికి జిల్లా పార్టీ అధ్యక్షులు, కార్యదర్శి, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులలో కనీసం ఒకరైనా ప్రత్యక్ష నాయకత్వం వహించాలి. అంటే కనీసం 3 మందితో బృందం వుంటుంది. వీరికి తోడుగా ఆ మండలంలో ఆసక్తిగల రైతుల్ని, ఇతర కార్యకర్తల్ని కలుపుకుని 5,6 మందితో బృందాన్ని నిర్దిష్టపరుచుకోవాలి.

**3. రోజువారీ కార్యక్రమం :** ప్రతి మండలంలో ఒకరోజు కార్యక్రమాన్ని నిర్దిష్టంగా రూపొందించుకోవాలి.

✸ రోజుకి 5, 6 గ్రామాల పర్యటన వుండాలి

✸ ఏ గ్రామం, ఏ సమయానికి చేరేది. అక్కడ రైతులతో సమావేశం జరిగే బహిరంగ ప్రదేశాన్ని గుర్తించి రూట్‌మాప్‌ను ఖరారు చేసుకోవాలి. ఈ పని స్థానిక బాధ్యుడు, జిల్లా పార్టీ ప్రతినిధి ముందుగా ఆ గ్రామాలకు వెళ్లి నికరం చేసుకోవాలి. మనకి ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పాటు ఇచ్చే వారు వున్న గ్రామాలను ఎంపిక చేసుకోవాలి. మొత్తం 4 మండలాలలో 4 రోజుల కార్యక్రమాన్ని ఒక కరపత్రంగా ప్రచురించి ముందుగా పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలి.

**4. ప్రచార సామగ్రి :**

✸ ఒక ప్రచార వాహనం – జీపు లేదా టాటా మొబైల్ వగైరా ✸ బానర్లు, ఫ్లెక్సీలతో అలంకరణ, ✸ మైకు, ✸ తగినన్ని కరపత్రాలు ✸ ప్రచారం సందర్భంగా రైతు ఉద్యమం పట్ల ఆసక్తి చూపించే రైతుల పేర్లు నమోదు పత్రం.

**5. ప్రచార యాత్ర :** ఉదయం 9 గంటలకు యాత్ర ప్రారంభించాలి. ఎంచుకున్న గ్రామాలలో కనీసం 1 గంటపాటు వుండాలి. సమావేశాలలో స్థానిక రైతులతో మాట్లాడించాలి. రైతులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడి "రైతు వేదిక" కార్యకలాపాల పట్ల ఆసక్తి వున్న వారి పేర్లు నమోదు చేసుకోవాలి. అలా కాకుండా సెంటర్లో ప్రసంగిస్తూ పోవడం వల్ల ప్రయోజనం వుండదు.

**6. మండల రైతు వేదికల ఏర్పాటు :** నాలుగు మండలాలలో 4 రోజుల పర్యటన తర్వాత 5వ రోజున మండలాల వారీగా తాత్కాలిక రైతు వేదికలను ఏర్పాటు చెయ్యాలి.

బృంద సభ్యులు చివరిరోజు రెండుగా విడిపోయి ఒక్కొక్క బృందం రెండు మండలాలలో రైతు వేదికల ఏర్పాటుకు బాధ్యత తీసుకోవాలి. మండల కేంద్రంలో లేదా అనువైన గ్రామంలో ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి సమావేశాలు నిర్వహించాలి.

గ్రామాలలో పేర్లు ఇచ్చిన వారందరికీ ఈ సమావేశ ప్రదేశం, సమయం తెలియపర్చి వారు వచ్చేలా స్థానిక పార్టీ ప్రతినిధి బాధ్యత తీసుకోవాలి.

✸ ఈ సమావేశంలో మండలస్థాయి రైతు వేదికను ఒక కన్వీనరు, గ్రామానికి ఇద్దరు ముగ్గురు ప్రతినిధులతో కమిటీని ఏర్పాటు చెయ్యాలి.

కన్వీనరుగా వుండేవారు అందరికీ ఆమోదయోగ్యమైన వారు, దీనికి తగిన సమయం ఇచ్చే వారుగా వుండాలి. ఈ కన్వీనరు బాధ్యతను లోక్‌సత్తా పార్టీ స్థానిక నాయకులు చేపట్టకూడదు. రైతుల నుండే కన్వీనర్లు వుండేలా చెయ్యాలి. స్థానిక లోక్‌సత్తా పార్టీ ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా మాత్రమే వుండాలి.

**7. గ్రామాలలో రైతు వేదికలు :** మండలస్థాయి తాత్కాలిక కమిటీకి ఆ మండలంలో గ్రామాలలో రైతు వేదికలను వెంటనే ఏర్పాటు చేసే బాధ్యత అప్పగించాలి.

✸ ప్రతిగ్రామంలో మైకు ద్వారా, టముకు ద్వారా అందరి రైతులనీ ఆహ్వానించాలి. సమావేశ స్థలం, సమయం ప్రచారం చెయ్యాలి. సమావేశానికి వచ్చిన వారితో "రైతువేదిక"ను ఏర్పాటు చెయ్యాలి. అధ్యక్ష – కార్యదర్శులను ఆసక్తిగల వారందరితో గ్రామ కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. పార్టీల అనుబంధాలకి అతీతంగా అందరినీ ఈ కమిటీలలో సభ్యుల్ని చెయ్యాలి.

**8.** బృందనాయకులు విధిగా వారు గ్రామాలలో సేకరించిన పేర్ల జాబితాని – మండలస్థాయి తాత్కాలిక కమిటీ సభ్యుల జాబితాలను సేకరించి ఒక కాపీని కేంద్ర కార్యాలయానికి విధిగా పంపించాలి. ★




# గృహహింస చట్టంపై 26న రౌండ్‌టేబుల్ సమావేశం

గృహహింస చట్టం అమల్లోకి వచ్చి అక్టోబర్ 26కు నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా లోక్‌సత్తా అనుబంధ మహిళాసత్తా, లోక్‌సత్తా లీగల్ సెల్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల మహిళావిభాగాలు, మహిళా సామాజిక కార్యకర్తలతో పార్టీ ప్రధాన కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది.

మహిళా కాంగ్రెస్ నుంచి త్రిపురాన వెంకటరత్నం, కె. పుష్పలీల, ప్రజారాజ్యం అనుబంధ మహిళారాజ్యం నుంచి మాధవీ దీపక్, షాహెదాబేగం, ఎ.పి మహిళాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అరుణ, తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షురాలు ఎన్. జయలక్ష్మి, వికాసధాత్రి ప్రతినిధి కె. అరుణ, ఏఐఎఫ్‌డబ్ల్యు ప్రతినిధి చల్లా ఉమ, సామాజిక కార్యకర్తలు కల్పవల్లి, లక్ష్మి, మహిళాసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి, జిహెచ్ఎంసీ కార్యదర్శి గజానని, లీగల్‌సెల్ ప్రతినిధి పద్మావతి, లోక్‌సత్తా నేతలు వై.రమాదేవి, సుభాషిణి, మంగళ, రమాసుభద్ర, సుజాత, విమలాదేవి, శారద, విజయకుమారి, విజయవెంకటేశ్వరి, నిర్మలారాణి, వి. రామచంద్రయ్య, ఎ.బి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహిళాసత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గీతామూర్తి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

కుటుంబ వ్యవస్థను కాపాడటం, మహిళలలో స్వావలంబన శక్తిని పెంచటం దిశగా గృహహింస చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాల్సుందని లోక్‌సత్తా పార్టీ లీగల్ సెల్, మహిళాసత్తా ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం అభిప్రాయపడింది. గృహహింస చట్టాన్ని మహిళలు ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్నారని, అయితే అమలులో మాత్రం చాలా లోపభూయిష్టంగా ఉందని పేర్కొంది. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ చట్టాన్ని అమలు చేయటం వల్ల నామమాత్రంగా జరుగుతోందని, ఈ చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని, చట్టంపై విస్తృత ప్రచారం చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. గృహహింస బారిన పడుతున్నవారిలో మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నప్పటికీ దాని బారిన పడుతున్నవారిలో పురుషులు కూడా ఉన్నారని అభిప్రాయపడింది. మద్యం, వినిమయ సంస్కృతి పెరగటం, నాణ్యమైన విద్య లేకపోవటం కారణాల వల్ల గృహహింస కేసులు పెరుగుతున్నాయని, గృహహింస చట్టం దుర్వినియోగం కాకుండా కూడా చర్యలు అవసరమని వక్తలు పేర్కొన్నారు.

లోక్‌సత్తా లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సి.వి.ఎల్. నరసింహారావు చర్చను ప్రారంభిస్తూ, గృహహింసను అరికట్టటానికి ప్రభుత్వం మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. మీడియా కూడా ఈ చట్టం అమలును ఓ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, 'రక్తచరిత్ర' సినిమాకిచ్చిన ప్రచారంలో వెయ్యోవంతు ఇచ్చినా

కొంతమంది మహిళల కన్నీళ్లను తుడిచినవారవుతారని అన్నారు. మహిళాకాంగ్రెస్ ప్రతినిధి త్రిపురాన వెంకటరత్నం మాట్లాడుతూ, ఇలాంటి సమావేశాల్ని పార్టీల మహిళా విభాగాలే కాకుండా పార్టీలే స్వయంగా చేపట్టాలని అన్నారు. కుటుంబ సలహా కేంద్రాలను మండల స్థాయి వరకూ ఏర్పాటు చేసి కొంత వయసు, పరిణతిగల వారిని అందులో నియమించాలన్నారు. కేవలం ప్రభుత్వమే కాకుండా పౌరసమాజం కూడా ఇందులో బాధ్యత తీసుకోవాలని, రిటైరైన ఉద్యోగుల సేవల్ని ఇందుకోసం వినియోగించుకోవాలని సూచించారు. సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించటానికే తొలుత ప్రాధాన్యత ఇవ్వాలని, మరీ తీవ్రమైన కేసుల్లోనే చట్టాన్ని ప్రయోగించాలని అన్నారు. పార్టీలేవైనా మహిళలు తమ సమస్యల పట్ల ఏకమవుతూ అఖిలపక్షాలు జరుపుకుంటుండటం రాష్ట్ర రాజకీయాల్లో ఓ మంచి పరిణామమని మరో కాంగ్రెస్ నేత పుష్పలీల అన్నారు. ప్రజారాజ్యం అధికార ప్రతినిధి మాధవీ దీపక్ మాట్లాడుతూ, మద్యం, ఇతర వ్యసనాలను రూపుమాపటం గృహహింస నివారణకు కీలకమన్నారు. 28శాతం మాతాశిశుమరణాలు గృహహింస వల్లే జరుగుతున్నాయన్న విషయాన్ని సమాజం అర్థం చేసుకోవాలని సామాజిక కార్యకర్త లక్ష్మి అన్నారు.

ఎ.పి మహిళాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అరుణ మాట్లాడుతూ, భారతదేశం మార్పుకు లోనవుతున్న దశలో ఉందని, దీనికి తగ్గట్టు గృహహింస చట్టాన్ని అమలుచేయాల్సి ఉందన్నారు. నిబద్ధత గల మహిళాసంఘాలనే సర్వీస్ ప్రొవైడర్లుగా గుర్తించాలని, వెంటనే రాజకీయాలకు అతీతంగా న్యాయ పరిజ్ఞానం ఉన్న నిష్ణాతులతో రాష్ట్ర మహిళా కమిషన్ నియమించాలని డిమాండ్ చేశారు. చల్లా ఉమ మాట్లాడుతూ, ఏకపక్ష కౌన్సెలింగ్, ఎంత హింస జరిగినా నష్టపరిహారం చెల్లిస్తే చాలు వంటి లోపాలు గృహహింస చట్టంలో ఉన్నాయన్నారు. మహిళాసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ, గృహహింసలో దోపిడీ, వివక్ష, అసమానత కలిగిన ఆర్థిక, సాంఘిక నిర్మాణాల్ని కొనసాగించటం ఉన్నాయని, ఈ చట్టంపై గ్రామసభలలో సైతం వివరించాలని అన్నారు. హింసను నివారించి నిందితులను శిక్షించటానికి వేగవంతంగా చర్యల్ని చేపట్టాలన్నారు. వికాస ధాత్రి ప్రతినిధి అరుణ మాట్లాడుతూ, ప్రభుత్వం, మీడియా, పౌరసమాజం కలిసికట్టుగా ఈ చట్టం అమలుకు కృషి చేయాలన్నారు. ★

# వేర్పాటువాదాన్ని మొగ్గలోనే తుంచండి : జేపీ

మతం పేరుతో స్వయంనిర్ణయాధికారాన్ని కోరుతున్న శక్తులకు వత్తాసు పలకటం ద్వారా భారతదేశ ఐక్యతను, సమగ్రతను మానవ హక్కుల కార్యకర్తలు దెబ్బతీయవద్దు.

చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవటంలో మనం విఫలమైతే గత దారుణమారణకాండల్నే పునరావృతం చేస్తుంటాము. 1947లో మతం పేరుతో భారతదేశ విభజన వల్ల 1.5కోట్ల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. 10లక్షలమంది ఊచకోతకు గురవగా 600,000 మంది క్షతగాత్రులయ్యారు. 300,000మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. ఇటీవలికాలంలోనే చూస్తే... అంతకుముందున్న యుగోస్లావియా ముక్కచెక్కలవటం వల్ల తెగల మూకుమ్మడి ఊచకోత, అరాచకత్వం చోటుచేసుకున్నారు. ఇలాంటి వేర్పాటు డిమాండ్ల వల్లే పాకిస్తాన్, శ్రీలంక ఇదే తరహా భయంకర సంక్షోభానికి గురయ్యాయి. అందుకు భిన్నంగా భారతదేశం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నా తన ఐక్యతను, సమగ్రతను కాపాడుకోవటంలో గణనీయ విజయాన్ని సాధించింది.

'స్వాతంత్ర్యం ఒకే ఒక్క మార్గం' అనే అంశంపై అక్టోబర్ 21న న్యూఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో హురియత్ కాన్ఫరెన్స్ నేత సయ్యద్ అలీ షా గిలానీ చేసిన ప్రసంగాలు గర్హనీయం. అలాంటి ధోరణులకు మానవ హక్కుల నేతలు మద్దతు పలుకుతుండటం ఆందోళనకరం.

అన్ని ప్రాంతాలకు చెందినవారు, భిన్న భాషలు మాట్లాడే, భిన్న మతాల్ని అనుసరించే వారు తమ ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చుకోగలిగే విధంగా ఏర్పాటున్న అద్భుతమైన రాజ్యాంగం భారతదేశానికి ఉంది.

భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్న శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలి. "దేశం ఒకటిగా, ఐక్యంగా ఉన్నప్పుడు మాత్రమే భారతీయులకు శాంతి, అభివృద్ధి, మానవ హక్కులు ఉంటాయి. ఓట్లు, అధికారం కోసం రాజకీయ పార్టీలు ఘర్షణ కల్లోల వాతావరణాల్ని పెంచి పోషించే ధోరణికి స్వస్తి చెప్పాలి. మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల్ని, స్వాతంత్ర్యానంతరం ఇప్పుడున్న భారతదేశ నిర్మాణానికి మన దార్శనిక నేతలు చేసిన కృషిని వృధా కానివ్వద్దు". ★

# కర్ణాటకను చూసైనా నేర్చుకోండి...

వరి ధాన్యానికి కనీస మద్దతు ధరకు అదనంగా రూ.200 బోనస్ ప్రకటించాలని ముఖ్యమంత్రి రోశయ్యకు లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నవంబరు6న విజ్ఞప్తి చేశారు.

కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరులో నవంబర్ 3న ధాన్యం రైతులు భారీసదస్సును నిర్వహించి తమ దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తెచ్చిన 24గంటలలోనే కర్ణాటక ప్రభుత్వం స్పందించి క్వింటాలుకు రూ.100 బోనస్‌ను ప్రకటించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐదుశాతం గ్రామీణాభివృద్ధి సుంకం, నాలుగు శాతం వ్యాట్ (అమ్మకపు పన్ను), ఒక శాతం మార్కెట్ సుంకంతో రైతుల మీద భారం మోపుతోంది. అందుకు భిన్నంగా కర్ణాటక ప్రభుత్వం కేవలం 1.5శాతం మార్కెట్‌సుంకం మాత్రమే వసూలు చేస్తోందితప్ప గ్రామీణాభివృద్ధి పన్ను లేదా వ్యాట్‌ను వసూలు చేయటం లేదు. రాష్ట్రం వెలుపల బియ్యం అమ్మకాలు జరగకుండా కర్ణాటక ఎటువంటి ఆంక్షలనూ విధించలేదు.

వ్యాట్‌ను తొలగించి బియ్యం రాష్ట్రం వెలుపల స్వేచ్ఛగా రవాణా జరిగేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. ప్రభుత్వ, ప్రైవేటు గోదాములు ఆహారధాన్యాలతో పొంగిపొర్లుతుండటంతోపాటు దేశంలో ఈ ఏడాది పంటల దిగుబడి ఇబ్బడిముబ్బడిగా ఉన్నందున బాస్మతేతర బియ్యం ఎగుమతికి అనుమతినిచ్చేలా భారత ప్రభుత్వాన్ని ఒప్పించాలి. అంతర్జాతీయ మార్కెట్లలో బియ్యం ధరలు భారీగా ఉన్నందున దేశానికి విదేశీ మారక ద్రవ్యం లభించటంతోపాటు ధాన్యం రైతులకు లాభసాటి ధరను చెల్లించే అవకాశం లభిస్తుంది.

ధాన్యం ఇప్పటికే మార్కెట్లోకి వచ్చిన ప్రాంతాల్లో ఇస్తున్న ధరలు కనీస మద్దతు ధరకన్నా కూడా తక్కువగా ఉన్నాయి. బియ్యం ఎగుమతుల్ని అడ్డుకోవటం వల్ల ధరలు ఇంకా పడిపోయి ఉత్పత్తిదారులను దెబ్బతీస్తుంది. ★

# రైతుల్ని ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి: లోక్‌సత్తా

పంట చేతికొచ్చే సమయంలో ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో అకాల భారీవర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. సుమారు 6-7లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. మొదటి పంటే చేతికొచ్చే సమయంలో నష్టపోవటంవల్ల రైతుకు గట్టి దెబ్బ తగులుతుంది. అందువల్ల పెద్దఎత్తున ప్రభుత్వం సహాయాన్ని అందించాలి. దెబ్బతిన్నవారిలో ఎక్కువమంది కౌలురైతులే, వారంతా పేదలు, సామాన్యులే, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం సమగ్రచర్యలు చేపట్టకపోతే అన్నదాతల ఆత్మహత్యల సంఖ్య పెరిగే ప్రమాదముంది. రైతుల్లో మనోధైర్యం నింపి వారిని రెండోపంటకు సన్నద్ధం చేసేలా ప్రభుత్వ సహాయ చర్యలు ఉండాలి.

1) మొదటి పంట చేతికొచ్చే సమయంలో తీవ్రంగా పంటనష్టం వచ్చినందున రైతుల్ని ఆదుకునేందుకు నిబంధనల పేరుతో ఆలస్యానికి అవకాశం లేకుండా ప్రభుత్వం ఒక ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి, అందులో కౌలురైతులకు నేరుగా సహాయం అందించే ఏర్పాటు ఉండాలి.

2) తడిసిన ధాన్యాన్ని సేకరించి ఉప్పుడు బియ్యం తయారీకి మళ్లించే ఏర్పాట్లు చేయాలి.

3) రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసే ఏర్పాట్లు చేయాలి.

4) బ్యాంకులు రుణాలను ఆరునెలలకోసారి వసూలు చేస్తున్నందున ప్రస్తుత పరిస్థితుల్లో వాటిని రీషెడ్యూల్ చేయాలి".

పార్టీ శ్రేణులు సహాయచర్యల్లో పాల్గొనాలి

లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు ఎక్కడికక్కడ దెబ్బతిన్న పంటపొలాల్ని సందర్శించి రైతుల్లో స్థయిర్యం నింపాలి. నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తేవటంతోపాటు తాత్సారం లేకుండా సక్రమంగా అంచనాలను రూపొందించి ఇన్‌పుట్ సబ్సిడీలు, ఇన్సూరెన్స్ సహా అన్ని సహాయాలు సక్రమంగా అందించేలా సర్కారుపై ఒత్తిడి తేవాలి. ★



# నల్గొండ

## రైతన్నలతో జేపీ ఇష్టాగోష్టి

**కోదాడ :** రైతుల కోసం, రైతుల ఐక్యత కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రైతులతో ఇష్టాగోష్టి కార్యక్రమంలో భాగంగా కోదాడ గ్రామపంచాయితీ కార్యాలయంలో రైతులతో ఆసక్తికరంగా చర్చించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన రైతుల్లో ఒక్కొక్కరిని లేపి పంటల్లో ఏ పంట పండిస్తున్నారు, ఎంతలాభం వస్తుంది, ఎంత నష్టం వస్తుంది అన్ని అంశాలను వారి నుంచి రాబట్టారు. మొదటగా తమ్మరబండపాలెంకు చెందిన రైతు నాగేశ్వరరావుతో మట్లాడారు. వారి సంభాషణ ఈ విధంగా ఉంది.

**జేపీ :** నాగేశ్వరరావు గారు ఏం పంట వేశారు?

**రైతు :** వరి పంట వేశాం సార్.

**జేపీ :** ఏం వరి వేశారు

**రైతు :** బిపిటి స్వర్ణ

**జేపీ :** దిగుబడి ఎంత వచ్చింది.

**రైతు :** సుమారు 30 బస్తాలు వచ్చింది

**జేపీ :** పంట ఖర్చు ఎంత వచ్చింది

**రైతు :** ఎకరానికి రూ॥15 వేలు వచ్చింది

**జేపీ :** చేసిన దానికి ప్రతిఫలం వచ్చిందా.

**రైతు :** రాలేదు సార్.

**జేపీ :** మార్కెట్‌లో ఇప్పుడు ఎంత రేటు ఉంది.

**రైతు :** 650 ఉంది సార్.

**జేపీ :** అదేంటి సిఎం గారు రూ॥750లకు తక్కువ ధర వస్తుందని ఒక్క రైతుతో చెప్పించండి అని ఛాలెంజ్ గాస్తున్నారు. మీరు చెప్పేది నిజమేనా అని రైతును ఒకటికి రెండుసార్లు రెట్టించి అడిగారు. దీనితో రైతుతో పాటు అక్కడ పాల్గొన్నవారు నిజమేనని చెప్పడంతో ఆయన ఆశ్చర్యపోయారు.

### మరో రైతు నాగిరెడ్డితో జేపీ

**జేపీ :** నాగిరెడ్డి గారు ఏ ఏ పంటలు పండిస్తారు.

**రైతు :** పత్తి, వరి సార్

**జేపీ :** పత్తి పంట లాభదాయకంగా ఉందా.

**రైతు:** పత్తి పంట ఆదాయం బాగానే ఉంది సార్. కాకపోతే వర్షాలకు కొంత దెబ్బతిన్నది సార్.

**జేపీ :** పత్తి పంట దిగుమతి ఎలా ఉంది.

**రైతు :** బాగా పండితే ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్లు వస్తుంది సార్.

### మరో రైతు శ్రీనివాసరావుతో జేపీ సంభాషణ

**జేపీ :** శ్రీనివాసరావు గారు, ఎంత పొలం ఉంది, ఏం పంటలు పండిస్తున్నారు.

**రైతు :** సార్. నాకు 2 ఎకరాలు మాత్రమే ఉంది. మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పండిస్తున్నాను.

**జేపీ :** కౌలు ఎంత ఇస్తున్నారు.

**రైతు :** ఎకరాకు 14 బస్తాలు సార్.

**జేపీ :** ఏం పండించారు.

**రైతు :** సన్నరకం పండించమన్నారు. మిల్లర్లు కొనడం లేదు సార్. నష్టం వస్తుంది సార్.

**జేపీ :** నష్టం వస్తే కౌలుకు ఎందుకు చేస్తున్నారు.

**రైతు :** వరిగడ్డి అయినా మిగులుతుందన్న ఆశ సార్. ఆ గడ్డితో పాడి గేదెలతో పాలు వ్యాపారం చేసుకుంటాను సార్.

ఇది రైతులకు, జయప్రకాష్ నారాయణ్‌కు జరిగిన ఆసక్తికర సంభాషణ. ★



# మెదక్

## ముంచేసిన తెల్లబంగారం

- అధిక వర్షాలతో దిగుబడిపై తీవ్ర ప్రభావం
- పత్తి సాగు చేసిన వారికి రూ.10 కోట్ల పైనే నష్టం

**సంగారెడ్డి :** తెల్లబంగారం (పత్తి) పండిస్తున్న అన్నదాతలు, అప్పులపాలై కన్నీరు పెడుతున్నారు. వర్షాలు ఎక్కువగా పడుతుండటంతో తెగుళ్లు సోకి పంట చేతికి రావడం లేదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పత్తి వేశారు. కిందటేడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు రైతులను ఆర్థికంగా కుంగదీస్తే, ఈ ఏడాది ఎడతెరిపి లేని వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఎకరానికి హీనపక్షం రూ.4 వేలకు తక్కువ కాకుండా నష్టపోతున్నారు. వేసిన పంటల్లో కనీసం 40 శాతం మేర దెబ్బతిన్నాయి. ఈ సీజన్ 78 వేల హెక్టార్లలో పత్తి సాగు చేశారు. సగటున ఎకరానికి 15 నుండి 18 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. ఈసారి 2 క్వింటాళ్లకు మించి ఉండటం లేదు. ఎకరాకు పత్తి పంట వేసేందుకు దాదాపు రూ.10 వేల వరకూ ఖర్చవుతుంటే క్వింటాలుకు రూ.3500 చొప్పున ధర పలికినా ఇంకా రూ.3 వేల చొప్పున పెట్టుబడులు కూడా నష్టపోయే పరిస్థితి ఉంది.

అధిక వర్షాల కారణంగా నల్లరేగడి ప్రాంతాల్లో చీడపీడల ప్రభావం ఎక్కువగా ఉంది. పత్తి మొక్కలు నల్లగా మారిపోతున్నాయి. పూత కూడా ఉండటం లేదు. పేను లాంటి తెగులు సోకుతోంది. అక్కడక్కడ మిగిలిందే చాలనుకుని పత్తిని తీసినా... వర్షాల ప్రభావంతో రంగు మారిపోతోంది. వ్యాపారులు దీన్నే సాకుగా చూపించి ధర తక్కువగా చెల్లిస్తున్నారు. తెగుళ్ల నివారణ చర్యలపై ఎవరూ అవగాహన కలిగించటంలేదు.

జిల్లాలో ఇంతవరకూ అనధికారికంగా చెపుతున్న లెక్కల మేరకైనా 20 శాతం పంట దెబ్బతినే అవకాశం ఉంది. దాదాపు 13500 హెక్టార్ల పరిధిలో పత్తి పంట పూర్తిగానో, పాక్షికంగానో దెబ్బతింది. ఈ లెక్కన చూసినా రైతులు సుమారు రూ.10 కోట్లకు పైగా పెట్టుబడులు నష్టపోయి ఉండవచ్చని తెలుస్తోంది. కొన్ని చోట్ల ఆశలు వదులుకుంటున్న రైతులు అప్పుడే ఈ పంటలను దున్నేసి ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధపడుతున్నారు. గజ్వేల్, సిద్ధిపేట, సదాశివపేట ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

## రైతు సమస్యలపై స్పందించిన జేపీ

- సిద్ధిపేటలో రూ.5.5 కోట్లతో పత్తి మార్కెట్ యార్డు నిర్మించినా వినియోగంలోకి తేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
- తడ్కపల్లి నుంచి ధాన్యం తెచ్చిన మహిళా రైతు వజ్రమ్మ మాట్లాడుతూ, ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని అధికారులు చెప్పడంతో రెండురోజులుగా ఆరబెడుతున్నానని తెలిపారు. ధాన్యానికి గిట్టుబాటు ధర రావడం లేదని వాపోయింది.
- జిల్లాలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం లేక ఇబ్బందిగా ఉంది. కరీంనగర్ జిల్లాలోని సహకార సంఘానికి అనుసంధానం చేయాలి.

- రైతులకు రూ. 100కే బ్యాంకు ఖాతాలు ఇచ్చేలా చొరవ చూపాల్సిందిగా ప్రభుత్వానికి విన్నవిస్తాం.
- పత్తి మార్కెట్ యార్డు వినియోగంలోకి తెస్తే మరో రూ.2 కోట్ల ఆదాయం వస్తుందని మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శికి ఫోన్లో వివరించారు.

## రైతుల పరిస్థితి దయనీయంగా మారింది

**సిద్ధిపేట :** నవంబరు 9న లోక్‌సత్తా ఆధ్వర్యంలో రైతుల సమస్యలను తెలుసుకోవడానికి 2వ విడతగా మెదక్ జిల్లాలోని కొండపాక మండలం దుద్దెడ, చిన్నకోడూరురాముని పట్ల గ్రామాలను జేపీ సందర్శించి రైతులను వ్యవసాయ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో పందుల బెడద, ధాన్యాన్ని భద్రపర్చుకోవడానికి వీలు లేకుండా పస్తులు ఉంటూ రాత్రి సమయంలో జాగరణ చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. హమాలీలకు ఒప్పందం ప్రకారం కాకుండా తమ ధాన్యాన్ని దానం రూపకంలో తీసుకుని మోసం చేస్తున్నారని జేపీ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన స్పందిస్తూ సిద్ధిపేట మార్కెట్‌లో 200ల కోట్ల వ్యాపారం జరుగుతుందని మార్కెట్‌కు 2 కోట్ల రూపాయల ఆదాయం వచ్చినప్పటికి రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొద్దిపాటి ఖర్చు పెట్టడం లేదన్నారు. మార్కెట్ యార్డులోకి పందులు దూరకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఎలక్ట్రానిక్ తూకం, తడి ధాన్యాన్ని ఆరబెట్టడానికి బాయిలర్లను ఏర్పాటు చేసినట్లయితే రైతులకు ఇబ్బందులు కలుగవన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు సౌకర్యాలు ఉండక ఇబ్బందులు పడుతుండగా అయిదున్నర కోట్లతో నిర్మించిన కాటన్ మార్కెట్ స్మశానంగా మారిందన్నారు.

## మార్కెట్ యార్డులు దారుణం

**సిద్ధిపేట :** వ్యవసాయ మార్కెట్ యార్డులలో కనీస సౌకర్యాలు కల్పించకుండా ధాన్యం అమ్ముకోవడానికి వచ్చే రైతులకు నరకం చూపిస్తున్నారు. మొక్కజొన్నలు, వడ్లకు గిట్టుబాటు ధర లభిస్తుందా అని జేపీ అడుగగా వడ్లకు కనీస మద్దతు ధర కూడా రావడం లేదని వాపోయారు. ధాన్యం అమ్మిన వెంటనే డబ్బు కావాలంటే ఒక శాతం కోత విధిస్తున్నారని తెలిపారు. శాంపిల్ల పేరిట, హమాలీలు, ఊడ్చే వారి పేరిట ధాన్యం గుంజుకుంటున్నారని ఆరోపించారు. వారితో వివిధ అంశాలు మాట్లాడిన అనంతరం జేపీ విలేఖరులతో మాట్లాడుతూ మార్కెట్ యార్డులో ధాన్యం అమ్ముకోవాలంటే ఇంత నరకమైతే ఎలాగని ప్రశ్నించారు. మార్కెట్ యార్డులలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. జేపీ వెంట లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు, మెదక్ జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంకరమ్మ, రైతు సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు హన్మంతరెడ్డి, నాయకులు భైరవరెడ్డి, రాంచందర్‌రావు సుధీర్‌రెడ్డి, అమ్మన రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పంటలకు గిట్టుబాటు ధర చెల్లించండి

**సిద్ధిపేట :**

- **గిట్టుబాటు దక్కదు.. పెట్టుబడి మిగలదు**
- **యథేచ్ఛగా దళారుల దోపిడీ**
- **కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే ప్రాజెక్టులు**
- **ఉపాధి హామీని వ్యవసాయానికి జోడిస్తే మేలు**
- వ్యవసాయేతర రంగాల్లో సగటు భారతీయుడి సంవత్సరాదాయం లక్షా ఐదువేలుండగా సగటు భారతీయ రైతు సంవత్సర ఆదాయం రూ॥ 15 వేలు అంటే నెలకు 1250, రోజుకు 40 రూ॥ లుగా ఉంది.
- రైతులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక పంట పండించినా దండగా అనే విధంగా రైతు పరిస్థితి తయారైంది.
- గ్రామాల్లో 60 శాతం వ్యవసాయంపై ఆధారపడి ఉన్న జనాభాకు వ్యవసాయం ద్వారా ఆదాయం పెరిగితే రైతులు సంపాదించింది వారే తినకుండా, పట్టణాల్లో ఉన్న పరిశ్రమల్లో ఉత్పత్తి అయ్యే వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా పరిశ్రమలకు ఆదాయం పెరగడంతో పాటు దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

పంటలు పండించడమే కష్టంగా మారిన కాలంలో వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు రైతులపై యుద్ధం ప్రకటిస్తున్నాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందకపోతే దేశం నష్టపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయమార్గాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా వుంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే ఆర్థికాభివృద్ధికి అవకాశం లభించి వలసలు ఆగిపోతాయి. ప్రభుత్వాలు స్పందించి రైతులను రక్షించే విధానాలు అమలు చేయాలి. మద్దతు ధర లభించక రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా ప్రభుత్వాల్లో చలనం లేదు. అంతర్జాతీయ మార్కెట్లలో సన్న బియ్యం కిలోకి 120 రూపాయలు పలుకుతుంటే ఇక్కడ కనీస మద్దతు ధర లభించకపోవడం శోచనీయం. రైతాంగ సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఇందుకోసం ఎంపిక చేసిన వారికి శిక్షణా కార్యక్రమాల రూపకల్పన జరుగుతోంది. రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టుల నిర్మాణం

కాంట్రాక్టర్ల కోసమే. డిజైన్ల పేరిట కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్ల జేబుల్లోకి చేరుతున్నాయి. ఈ సమావేశంలో లోక్‌సత్తా నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్, బండారు రామ్మోహన్‌రావు, మదన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

## రైతులతో యుద్ధమా? జేపీ

**సిద్ధిపేట :** పంటలు పండించడమే కష్టంగా మారిన కాలంలో వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు రైతులపై యుద్ధం ప్రకటిస్తున్నాయి. దేశంలో అరవైశాతం మందికి ఆధారమైన వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురవుతోంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందకపోతే దేశం నష్టపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయమార్గాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు.

**కొండపాక :**

- రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక ఒక్క రూపాయి ఆదాయం మిగలకా ఆత్మహత్యలు చేసుకున్న తరువాత ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించే కన్నా వ్యవసాయంలో లాభాలు వచ్చే విధంగా చూస్తే బాగుంటుంది.
- గ్రామాల్లో వ్యవసాయం ద్వారా ఆదాయం రాకపోవడంతో యువత పట్టణాల్లోకి వెళ్లి బాత్‌రూమ్‌ల వంటి రూముల్లో కిరాయిలకు ఉండి 10 కిలో మీటర్ల దూరం వెళ్లి పనులు చేసుకుని రూ. 3 వేలు (చిన్నపాటి ఆదాయాన్ని) పొందుతున్నారు.
- రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి వాటికి ధర దించకుండా ఉంటే రైతులను కాపాడుకున్న వారమవుతాం. ధరలు దించి రైతులను నిరుత్సాహపర్చి నష్టపర్చకుండా, రైతులను ఉత్సాహపర్చాలి.
- ప్రభుత్వం బియ్యంపై 10శాతం పనుల్న విధించడం వలన రైతులపై భారం పడుతుంది. ప్రక్క రాష్ట్రమైన కర్ణాటకలో ఎగుమతి పన్ను విధించకపోవడంతో పాటు రైతుకు క్వింటాల్‌కు రూ. 100 బోనస్ ప్రకటించింది.
- ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే నూనె గింజకు పన్ను విధించని మన దేశం రైతులు పండించిన బియ్యాన్ని ఎగుమతి చేయడానికి పన్నులు విధించడంతో 15 మిలియన్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోతున్నాము.
- అంతర్జాతీయ మార్కెట్‌కు మన బియ్యాన్ని తరలించినట్లయితే ప్రస్తుతం వెయ్యి రూపాయలు ఉన్న ధాన్యం ధరను రూ. 1500 చెల్లించినా నష్టం ఉండదు. రైతు పంటలు పండించడం ఒక వంతయితే ధాన్యాన్ని అమ్ముకోవడం ఒక నరకంగా తయారైంది.

## కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చేందుకే ఎత్తిపోతల పథకాలు

- హైద్రాబాద్ నగరానికి త్రాగునీరు అందించడానికి కృష్ణ, నాగార్జున సాగర్‌ల నుండి 700ల కోట్లతో ఒక సంవత్సరం పూర్తవుతుందని తెలిసినా కాని కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చేందుకు రూ. 3,600 ల కోట్లతో ఎల్లంపల్లి నుండి హైద్రాబాద్‌కు త్రాగునీరు తేవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇన్ని కోట్లు ఖర్చుపెట్టినా ఎప్పుడు పూర్తి అవుతుందో తెలియదు. అయినా వర్షాలు పడకుంటే ఆ నీరు వస్తాయనే అంచనాలు కూడా లేవు. కృష్ణా జలాలను హైద్రాబాద్‌కు తరలించినట్లయితే ఎల్లంపల్లి నుండి ఎలాంటి ఎత్తిపోతలు లేకుండా కరీంనగర్ మెదక్ జిల్లాలో సాగునీరు అందివ్వవచ్చు.
- నిజంగానే రైతుల కోసం, వ్యవసాయం కోసం పనులు చేపట్టినట్లయితే ఆరు రెట్లు ఖర్చు తగ్గి గోదావరి నుంచి నీరు తేవడానికి ప్రయత్నించకుండా రూ. 38.500 ల కోట్లతో చేవెళ్ల నుండి నీరు తేవాలనుకోవడం కాంట్రాక్టర్లకు ధారాదత్తం చేయడమే.
- చేవెళ్ల నుండి సాగునీరు ఒక ఎకరాకు రూ. 3లక్షలు ఖర్చు అవుతుంది. నీరు అందిన తరువాత ప్రతియేటా రూ. 40 వేలు ఖర్చుచేయాల్సి వస్తుంది.
- ఈ పనుల్లో వేల కోట్ల రూపాయలను ధారాదత్తం చేయడం తప్ప రైతులకు ప్రయోజనం చేకూర్చేది ఏమిలేదు. ఈ సమావేశంలో బండారు రామ్మోహన్‌రావు, రాధారెడ్డి, మెదక్ జిల్లా లోక్‌సత్తా అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్, అమ్మన రాంచంద్రారెడ్డి, భైరవరెడ్డి, రాంచందర్‌రావు తదితరులు ఉన్నారు.

**కొండపాక :** రైతులు పండించిన పంటలకు సరైన రైటు ఇవ్వడం వల్ల మార్కెట్‌లో వస్తువుల ధరలలో ఎలాంటి మార్పు కనబడడం లేదని, దళారీ వ్యవస్థ వల్ల లాభం దళారులకు అందుతోంది. దీని పైన అవగాహన కల్పించి సామాన్య మానవునికి కూడా ఈ విషయం అర్థం కావడం కోసం కృషి చేయాలి.

## జేపీని అడ్డుకున్న తెలంగాణ వాదులు

**కొండపాక :** లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతులతో చర్చాగోష్టి కార్యక్రమానికి పాల్గొడానికి వచ్చిన జయప్రకాష్ నారాయణ దుద్దెడలో మంగళవారం తెలంగాణ వాదులు అడ్డుకున్నారు. దుద్దెడ గ్రామానికి చేరుకోగానే ఆయన వాహనానికి అడ్డంగా నిలబడి జై తెలంగాణ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆయన వాహనం దిగి వారితో మాట్లాడారు. వారు జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణ అంటే తెలుగు పరగణా అంటే దానికి తెలుగు మాట్లాడే నేల' ని అర్థం. నా తెలుగు నేలకు జై కొట్టటానికి నాకు అభ్యంతరం ఎందుకు అంటూ జేపీ వారితో కలిసి జై తెలంగాణ అంటూ గొంతు కలిపారు.

## సర్కారు మెడలు వంచి మద్దతు ధర సాధిద్దాం

■ రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర రావాలంటే రైతులంతా ఏకమై ఉద్యమించాలి... రైతుకు ఒక్క రూపాయి రావాలన్నా ఒక గింజ నాటి వెయ్యి గింజలు పండించాల్సిన పరిస్థితి.... అదే వ్యవసాయేతర రంగాలలో పనిచేయకున్నాడబ్బులు... లంచాలు... దేశంలో ధరలు పెరిగి చనిపోయిన వారు ఒకరైనా లేరు.... పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక అప్పుల పాలై చనిపోయిన రైతులు కోకొల్లలు.... రైతు తలసరి ఆదాయంకంటే... వ్యవసాయేతర రంగాల వారి తలసరి ఆదాయం 7 రెట్లు ఎక్కువ... తిండి గింజదొరకక పేదలు అల్లాడుతుంటే టన్నుల ధాన్యం గోదాముల్లో మూలుగుతున్నాయి. పాలకులు రైతు కుటుంబాలను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారు... రైతు విముక్తి కోసం సమయం ఆసన్నమైనది... ఏకమవ్వాలి... ఎదురొడ్డాలి అని జయప్రకాష్‌నారాయణ్ అన్నారు.

## పంట పండినా... ఎండినా.... రైతు నష్టపోవాల్సిందేనా....!

**కొండపాక :**

■ పంట పండినా ఎండినా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైంది.

■ మన రాజకీయ నాయకులు రైతులకు సరైన గిట్టుబాటు ధరను కల్పిస్తే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయని దుష్ప్రచారం చేస్తున్నారు. ఇది పచ్చి బూటకం. దీని పైన అవగాహన కల్పించి సామాన్య మానవునికి కూడా ఈ విషయం అర్థం కావడం కోసం కృషి చేయాలి.

■ రైతులకు వ్యవసాయం మీద ఆదాయం లేకపోతే పారిశ్రామిక రంగం కూడా దెబ్బతింటుంది. రైతులకు కొనుగోలు శక్తి లేనపుడు పరిశ్రమలు తయారు చేసిన వస్తువులను ఏ విధంగా కొనుగోలు చేస్తారు?

■ రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోకపోతే వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం నెలకొంటుంది. ప్రభుత్వం వ్యవసాయంపై తీసుకుంటున్న నిర్ణయాలు రైతును నష్టపరిచే విధంగా ఉన్నాయి.

■ రాజకీయ పార్టీలు రైతును ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి, తప్ప వారిని ఆదుకోవడానికి సరైన నిర్ణయాలు చేయడం లేదు పంటకు సరైన రేటు ఇస్తే వారే ఎప్పటికీ ఎన్నికల్లో గెలుస్తారు కానీ ఆ విధంగా చేయడం లేదు. రైతులు కాని, ప్రభుత్వంకాని వ్యవసాయాన్ని వ్యాపార దృక్పథంతో చూడాలి.

■ రైతులు పంటల పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర రాక ఆత్మహత్యలు చేసుకుంటే ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నారు తప్ప ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

■ రైతులు ఐక్యంగా లేకపోవడం వల్ల రాజకీయ నాయకులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. అందుకే రైతులు కులం, పార్టీలు మరిచి పోయి ముందుకు రావాలి. రైతులను ఐక్యం చేయడానికి ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

■ ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు రైతుల సమస్యలను జయప్రకాష్ నారాయణ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచాలా శ్రీనివాస్, జిల్లా రైతు సంఘాల సమన్వయ కర్త హన్మంతరెడ్డి, ఎంపీటీసీ దోమల ఐలవ్వ తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరు :** చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో జేపీ రైతులతో ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

■ రైతు పండించిన ధాన్యానికి రేటు వచ్చేలా రైతులంతా ఏకమై ఉద్యమించాలి.

■ నాలుగు కోట్ల 60 లక్షల టన్నుల ధాన్యం నిల్వలు గోదాముల్లో మూలుగుతున్నాయి. మనం ఉత్పత్తి చేసిన బియ్యంపై పదిశాతం పన్ను వేస్తూ రైతును నిలువునా దోచుకుంటున్నారు. దిగుమతి చేసుకుంటున్న సరుకులపై సుంకం వేయడం లేదు.

■ రైతు చేసిన ఉత్పత్తిని రైతు అమ్ముకునే హక్కులేని పరిస్థితి నెలకొంది. రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర రాక దేశంలో 3 లక్షల కోట్ల రూపాయలు రైతులు నష్టపోతున్నారు.

■ జాతీయ సంపదలో వ్యవసాయం వాటా 15 శాతమే ఉంది. 3 కోట్ల 65 లక్షల రైతు కుటుంబాలను పాలకులు ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారు.

■ రైతులు జాతీయ స్థాయిలో ఉద్యమించి మద్దతు ధర వచ్చేలా సాధించుకుందాం.

■ పండించిన పంటకు రేటు రావాలి వ్యవసాయం బతక్కపోతే దేశం బతకదు... పార్టీలకతీతంగా జాతీయస్థాయిలో ఉద్యమం చేయాల్సిన అవసరం వుంది.

■ రైతు కర్రె రత్నయ్య మాట్లాడుతూ అసెంబ్లీలో రైతు మాట్లాడే హక్కు రావాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు హన్మంతరెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుడు గాల్‌రెడ్డి, రైతులు చిట్టి వెంకటరెడ్డి, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, నాయకులు రాజలింగం, గందె శివకుమార్, మదూరి వెంకటేశంలు పాల్గొన్నారు. ★



# నిజామాబాద్

## 'జై తెలంగాణా' అంటూ నినదించిన జేపీ

**నిజామాబాద్ జిల్లా, తాడ్వాయి :** రైతు చైతన్య సదస్సుల నిర్వహణ కోసం జిల్లాకు వచ్చిన జయప్రకాష్ నారాయణ 'జై తెలంగాణా' అంటూ నినదించారు. మండలంలోని బస్వన్నపల్లిలో రైతు సదస్సులో రైతుల ఇబ్బందులు తెలుసుకుంటున్న ఆయనను తెలంగాణవాదులు అడ్డుకున్నారు. తెలంగాణ ఏర్పాటునకు లోక్‌సత్తా అనుకూలంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. తాను చిన్న రాష్ట్రాల ఏర్పాటునకు వ్యతిరేకం కాదన్నారు. చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా సమస్యలు ఉంటాయన్నారు. వారి కోరిక పై జై తెలంగాణ అంటూ నినదించారు.

రైతులు పండించిన ధాన్యానికి ధరలు పెరిగితే ఓట్లు తగ్గిపోతాయని..... ధరలు తగ్గితేనే ఓట్లు పెరుగుతాయనే ఆశతోనే పార్టీలన్నీ నడుస్తున్నాయి. నవంబర్ 10న ఆయన ఎల్లారెడ్డి, నాగిరెడ్డి పేట, లింగంపేట, నిజాంసాగర్, వర్ని, బాన్సువాడ, నిజామాబాద్ మండలాల్లో పర్యటించారు.

## రైతులు సంఘటితం కావాలి

**లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట :** శ్రమకు తగ్గ ప్రతిఫలం సాధించుకోవడానికి రైతులు సంఘటితం కావాలి. లింగంపేట మండలం మోతెలో రైతు ఐక్యఉద్యమ యాత్రలో భాగంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా దీర్ఘకాలిక ఉద్యమానికి ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా ముందుకు రావాలి. రైతులు స్పందిస్తేనే ప్రభుత్వంలో మార్పు వస్తుంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, రైతులకు రక్షణ, ప్రోత్సాహం కల్పించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. దేశం, రాష్ట్రంలో కులం, మతం పార్టీల పేరుతో పోరాటాలు చేస్తున్నారు కాని, రైతుల కోసం ఏ పార్టీలూ పోరాటాలు చేయడం లేదు. రైతులను దోచుకుంటున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి రాంరెడ్డి రమాదేవి, రమేష్‌బాబు, పద్మశేఖర్, దుర్గశేఖర్, నరహరి, సుధాకర్ మల్లయ్య, బాలరాజు, నారాయణ, భూమయ్య, రాంరెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ధరలు పెరిగితే ఓట్లు తగ్గిపోతాయి

**నిజాంసాగర్, వర్ని :** రైతులు పండించిన ధాన్యానికి ధరలు పెరిగితే ఓట్లు తగ్గిపోతాయని, ధరలు తగ్గితేనే ఓట్లు పెరుగుతాయనే ఆశతోనే పార్టీలన్నీ నడుస్తున్నాయని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. నిజాంసాగర్ మండలం గాలిపూర్, బాన్సువాడ, వర్ని, మండలం సత్యనారాయణపురం రైతులతో ఆయన చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి సమిష్టిగా ఉద్యమించాలి.

- కేవలం ఉల్లిపాయల ధరలతోనే కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారాయి.

- పెరుగుతున్న నిత్యావసర ధరలు తగ్గించాలంటూ ఎప్పుడూ చూసినా అసెంబ్లీలో చర్చ అంటారు. ఏనాడైనా తగ్గుతున్న ధరలపై చర్చ అన్నారా అంటూ ప్రశ్నించారు.
- రైతులు కులాన్ని, పార్టీని పక్కనబెట్టి ఏకం కావాలి. అప్పుడే ఈ దేశం బాగుంటుంది. లేదంటే నాశనమైపోతుంది.
- నా ప్రయత్నంతో ఒకదారి కోసం తపన అందుకే రైతుల సమస్యలు తెలుసుకునేందుకు రెండు రోజుల్లో కాల్‌సెంటర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభిస్తున్నాం. ఎవరైనా సరే 40405050కు కాల్ చేస్తే చాలు.
- ధాన్యంకు మద్ధతు ధరతో పాటు చెరకు ధర హర్యానాలో రూ.మూడు వేలుంటే రాష్ట్రంలో రూ.2,200 ఇస్తున్నారు. సన్నరకం ధాన్యం ధర కూడా పూర్తిగా పడిపోయింది. దీనిపై అసెంబ్లీలో పోరాడాలని గ్రామ రైతు మధుసూదన్‌రెడ్డి కోరారు. ప్రభుత్వం 2006లో రుణమాఫీ పథకం ప్రకటించిందని సహకార బ్యాంకులకు వర్తింపజేయలేదని బాన్సువాడ సింగిల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి కోరారు. పాడి సంపద, సింగూరు నీటి విడుదల, నిజాంసాగర్ లీకేజీ నీరు విడుదల చేయాలని నీటి సంఘం అధ్యక్షులు గంగారెడ్డి కోరారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, నిజామాబాద్ ఇన్‌చార్జి రమాదేవి, బాన్సువాడ ఇన్‌ఛార్జి గీతామూర్తి, లత, జిల్లా అధ్యక్షులు రాంరెడ్డి, జగన్నాథం, ఖలీల్ అహ్మద్, సాయిలు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం మద్దతు ధర కోసం ఉద్యమం...

**ఎల్లారెడ్డి :** ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించేందుకు ఉద్యమిస్తున్నాం. ఆంక్షలను తొలగించి విదేశాలకు ధాన్యాన్ని ఎగుమతి చేయాలి. ప్రభుత్వానికి బియ్యంపై రూ॥ 15000 కోట్ల సుంకం వచ్చినా రైతుల కష్టాలను తీర్చకపోవడం సిగ్గుచేటు. ఇలాంటి పరిస్థితుల్లో సంఘటిత ఉద్యమం తప్ప వేరే దారి లేదు. వరికి రూ॥ 1640 మద్దతు ధర కల్పించాలని..జేపీ అన్నారు. ★

## 14 [ఎఫ్] తొలగించేలా ఢిల్లీపై ఒత్తిడి తేవాలి

- **ఫ్రీజోన్‌పై అపోహల్ని పెంచొద్దు**

హైదరాబాద్ ఫ్రీజోన్ అంశంపై అపోహల్ని పెంచకుండా త్వరితగతిన ఢిల్లీ నుంచి సవరణ ఉత్తర్వు వెలువడేలా చొరవ తీసుకోవాలి. హైదరాబాద్‌లో జరిగే పోలీసు నియామకాలు జోనలైజేషన్ పరిధిలోకి వచ్చేందుకు వీలుగా 1975, రాష్ట్రపతి ఉత్తర్వులోని 14 (ఎఫ్) నిబంధనను తొలగించాలని అసెంబ్లీ తీర్మానం చేసి ఏడునెలలు గడుస్తున్నా తగిన స్పందన లేదు.

పోలీసు నియామకాల విషయంలో ఉన్న మినహాయింపు వల్ల హైదరాబాద్ జోన్‌లోని మొత్తం ప్రభుత్వ నియామకాలన్నీ ఫ్రీజోన్‌గానే జరుగుతాయనే అవాస్తవ ప్రచారం జరిగి ఆందోళనలు చెలరేగాయి. అందువల్ల అపోహలకు ఆస్కారం లేకుండా రాష్ట్రపతి ఉత్తర్వులోని 14 (ఎఫ్)ను తొలగించాలని లోక్‌సత్తా తొలినుంచీ వాదిస్తోంది. అక్టోబర్ 19, 2009న జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఒక్కరే ఈ డిమాండ్‌ను ప్రభుత్వం ముందుంచారు. ఇదే అంశంపై లోక్‌సత్తా తరుపున తీర్మానం ప్రవేశ పెట్టటానికి అనుమతినివ్వాలని ఫిబ్రవరి 17, 2010న ఎమ్మెల్యేగా స్పీకర్‌కు జేపీ నోటీసును కూడా ఇచ్చారు. సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని మిగిలిన పార్టీలతో కలిసి కొంతకాలం కాలక్షేపం చేసిన ప్రభుత్వం... ఎట్టకేలకు 14 (ఎఫ్) తొలగింపునకు మార్చి 18, 2010న అసెంబ్లీలో తీర్మానం చేసినా ఇప్పటికీ ఆ దిశగా ఢిల్లీపై ఒత్తిడి పెట్టలేకపోయింది. మళ్లీ అపోహలు చెలరేగి ఆందోళనలకు దారితీస్తున్నందున వెంటనే ఫ్రీజోన్ సమస్యపై ఢిల్లీని స్పందింపచేసేందుకు రాష్ట్రప్రభుత్వం చొరవ చూపాలి.

హైదరాబాద్‌లో జరిగే పోలీసు నియామకాలు జోనలైజేషన్ పరిధిలోకి వచ్చేందుకు వీలుగా 14 (ఎఫ్)ను తొలగించటం వల్ల ఇతర ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలు అక్కర్లేదు. ఈ విషయంలో విద్వేష ప్రచారాన్ని ఎవరూ విశ్వసించవద్దు. హైకోర్టు ఉత్తర్వుల వల్ల 2001-08 సంవత్సరాల మధ్య స్థానిక క్యాడర్లుగానే పోలీసు అధికారుల నియామకం జరుగుతున్నప్పటికీ ఎటువంటి సమస్యా తలెత్తలేదు. కాబట్టి 14 (ఎఫ్)ను తొలగించటం వల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదు. రాజకీయ పార్టీలు ప్రజలను విభజించి లబ్ధి పొందే ధోరణితోకాకుండా హేతుబద్ధమైన విధానంతో ప్రాంతాలకతీతంగా అందరికీ న్యాయం జరిగే రీతిలో వ్యవహరించాలి.



# పశ్చిమ గోదావరి

## రైతులు దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధం కావాలి

**తాడేపల్లి గూడెం, పెంటపాడు :** కులాలకు, పార్టీలకు, పంటల రకాలకు అతీతంగా రైతులు ఒకే కుటుంబంగా దీర్ఘకాలిక పోరాటాలకు, త్యాగాలకు సిద్ధం కావాలి. దీని ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి. జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ భవనంలో అక్టోబరు 30న జిల్లా రైతాంగ సమాఖ్య ఆధ్వర్యంలో అఖిలపక్ష రైతు సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి యెర్నేని నాగేంద్రనాథ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ తాను ఇంతవరకూ ఒక వర్గాన్ని రెచ్చగొట్టడం, ఉద్యమాలు చెయ్యమని ఎప్పుడూ ప్రోత్సహించలేదని, కానీ రైతుల పరిస్థితుల దృష్ట్యా ఉద్యమించక తప్పదన్నారు.

- గాంధేయ పద్ధతిలో శాంతియుతంగా, ప్రజా జీవనానికి కనీస అసౌకర్యం కలిగేలా దీర్ఘకాలిక ఉద్యమాలు చేద్దాం. రైతుల గుండెఘోష ఢిల్లీలో ప్రతిబింబింపచేయాలి.
- విదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహమిచ్చి దిగుమతి చేసుకుంటు దేశ రైతులను పిచ్చోళ్లుగా చూస్తున్నారు.
- రైతులకు ఎరువులను ఇవ్వడమే విజయంగా చెప్పుకునే ప్రభుత్వాలు ఉన్నంత వరకూ రైతుల కష్టాలు తీరవు. దేశంలో వ్యవసాయ రంగంలో 55శాతం ఆధారపడి ఉన్నారు. కానీ దేశసంపదలో 15 శాతం మాత్రమే ఆదాయం వస్తుంది.
- యువత వ్యవసాయంపై ఆసక్తి చూపడంలేదు. పట్టణాలకు ఉద్యోగాల పేరుతో వలసలు పోతున్నారు. గ్రామాలు నిర్జీవమైపోతున్నాయి.
- దేశంలో ఉన్న ఆర్థిక రంగాల్లో అందరి నిపుణులతో సంప్రదించే వారంతా ప్రభుత్వ విధానాలు రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులు రోడ్డు పైకి వచ్చి ఆందోళనలు చేస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావు. స్వతంత్ర్య భారతావనిలో వ్యవసాయాన్ని వలసగా చేశారు. 15 ఏళ్ల కిందట పశ్చిమలో మిల్లర్లు ఎవరికి ఎంత లంచం ఇవ్వాలనేది ఒక నివేదిక రూపొందించారని దీనిపై ప్రభుత్వ జిల్లా రైస్ మిలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రంగరాజుని వాస్తవమేనా అని ప్రశ్నించి అంగీకరింపచేశారు. ఇలాంటి అవినీతి జరుగుతుంటే రైతుకు న్యాయం ఎక్కడ జరుగుతుంది. మన దేశం 77 శాతం వంటనూనె సుంకం విధించకుండా దిగుమతి చేసుకుని ప్రోత్సహిస్తున్నారు. కోటి టన్నులు దిగుమతిపై 65 శాతం సుంకం విధిస్తే రూ. 25 వేల కోట్ల ఆదాయం వచ్చేది. రైతులకు బోనస్ దీనిద్వారా ఇవ్వవచ్చు. కానీ ఇతర దేశాల రైతులకు ప్రోత్సాహం ఇస్తున్నారు. ఇదేనా ప్రభుత్వ విధానమని విమర్శించారు. పంచదారని 55 లక్షల టన్నులు బ్రెజిల్ నుంచి, 45 లక్షల టన్నులు పప్పు ధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నారు. ప్రపంచంలో 12 శాతం వ్యవసాయ భూమి ఉంది. 900 మిల్లీలీటర్ల వర్షపాతం, ఉష్ణోగ్రత ఉంది. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తే కోట్లాది రూపాయలు ఆర్జించవచ్చు. 1.60 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు గోదాముల్లో పాడైపోతున్నాయి. ఆహారధాన్యాల ధరలు తగ్గి ధాన్యేతర ఆహార పదార్థాలు ధరలు పెరిగాయి. సరళీకృత ఆర్థిక విధానాలు పరిశ్రమలకే కాని, వ్యవసాయ రంగానికి మేలు చేయలేదు. ఏలూరు ఎంపీ కావూరి సాంబశివరావు రైస్ మిల్లర్ల జిల్లా అధ్యక్షులు రంగరాజు మాట్లాడుతూ క్రస్ట్ మిల్లింగ్ విధానం ప్రవేశపెడితే రైతులకు, మిల్లర్లకు మేలు చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యే ఈలి నాని సభలో రైతు సదస్సు

తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఎంపీలతో సహా అందరూ ఆమోదం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ,గూడెం జడ్పీటీసీ సభ్యుడు పోతుల అన్నంవరం, నల్లిమిల్లి రాఘవరెడ్డి, వీవీఎన్ వర్మ, వెంకయ్య, శేషారంగారావులు, సంఘం ఉపాధ్యక్షులు ఎంవీవీఎస్ నాగిరెడ్డి మాట్లాడారు.

### రైతు సదస్సు తీర్మానాలు ఇవే :

- రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని మరో 30 లక్షల టన్నులకు పెంచాలి. అందుకు ఎఫ్‌సీఐ అనుమతివ్వాలి.
- రాష్ట్రంలో నిల్వ ఉన్న ఇతర రాష్ట్రాల బియ్యాన్ని బయటకు తరలించేందుకు రాక్స్‌ను సరఫరా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖపై ఒత్తిడి తేవాలి.
- రైతు పంట పండించడానికి అయిన ఖర్చుపై కనీసం 50 శాతం లాభం ఉండేలా కనీస మద్దతు ధరను నిర్ణయించాలన్న స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి.
- పౌరసరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్‌లు తక్షణం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.
- సామాన్యుడు వాడే బియ్యపు రకాలు కాకుండా ఇతరాత్ర రకాలను విదేశాలకు ఎగుమతి చేయడానికి అనుమతివ్వాలి
- ఆహార ధాన్యాలకు కుళ్లబెట్టే బదులు పేదలకు ఉచితంగా పంచిపెట్టాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు కేంద్రం ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి.

### సమరానికి సిద్ధం కావాలి

**భీమవరం, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల :** రైతుకి తగిన ప్రతిఫలం దక్కకపోవడంతో వ్యవసాయం ప్రమాదకర పరిస్థితుల్లోకి చేరుకుంది. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో దుర్భర పరిస్థితులు నెలకొంటున్నాయి. రైతు సమస్యలపై పోరాటం చేపట్టిన జయప్రకాష్ నారాయణ రైతులను చైతన్యం చేసేందుకు జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. తొలుత ఉదయం ఉండిలో జరిగిన సమావేశంలో రైతు సమస్యలపై పోరాటం ఉద్దేశాలను వివరించారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలు, రైతుల సమస్యలపై లోతుపాతుల్లోకి వెళ్ళకపోవడం నిజంగా తాను తప్పు చేశానని జేపీ అంగీకరించారు. ఇప్పుడు పార్టీలకతీతంగా రైతు సమస్యలపై పోరాడతానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలపై ఏ మాత్రం పట్టనట్లే వ్యవహరిస్తున్నాయి.. రాష్ట్రంలో గోదాముల్లో నిల్వసామర్థ్యం మించి ఆహార ధాన్యాలు పేరుకుపోయాయి. ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటోంది. వ్యాపారం మాదిరి వ్యవసాయాన్ని కూడా సరళీకృత విధానాలతో పరుగు పెట్టించాలి. రైతు తనకి నచ్చిన విధంగా అమ్ముకునేలా స్వేచ్ఛా మార్కెట్ కల్పించాలి. దేశంలో పరిశ్రమలకి ఎనభై దశకంలో ప్రాధాన్యం ఇచ్చినట్లే, ఇప్పుడు వ్యవసాయానికి తక్షణ సాయం ప్రకటించుకుంటే సంక్షోభం తప్పదు. ఉండి సమావేశం అనంతరం వర్షంలోనే పాలకోడేరు బయల్దేరి వెళ్ళారు. రైతులనుద్దేశించి ప్రసంగిస్తూ పార్టీకతీతంగా పోరాటం జరుగుతుందని అంతా సన్నద్ధులు కావాలన్నారు. బంగారం, వజ్రాలకు పన్ను తక్కువగా ఉంటే రైతు ఉత్పత్తులకు పది శాతం పన్నులు వసూలు చేస్తున్నారని జేపీ దుయ్యబట్టారు. ఇతర దేశాల్లో కేజీ బియ్యం రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. మన దగ్గర అధిక నిల్వలను ఇతర దేశాలకు అమ్మి, ఆ సొమ్మును దేశీయంగా రైతు ప్రయోజనాలకు ఖర్చుపెట్టాలి. పాలకోడేరు సమావేశం అనంతరం భీమవరంలో భోజనం విరామ సమయంలో విలేకర్లతో మాట్లాడారు. దేశంలో బ్యాంకుల జాతీయకరణ తర్వాత ఆరు లక్షల గ్రామాలుంటే కేవలం 35 వేల పట్టణ ప్రాంతాల్లో మాత్రమే బ్యాంకులు శాఖలు ఏర్పాటు చేశారు. రైతు అప్పుల కోసం ప్రయివేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రయివేటు బ్యాంకులు 18 శాతం రుణాలు రైతులకి ఇవ్వాల్సి ఉన్నా, ఇవ్వలేమంటూ చేతులెత్తేశాయి. ప్రయివేటు బ్యాంకులు 8.5 శాతంతో మైక్రోఫైనాన్స్ సంస్థలకు మాత్రం ఇస్తున్నాయి. గ్రామీణులకు ప్రభుత్వం కొంత నిధిని కేటాయించి వడ్డీలకు తిప్పుకోమంటే, మైక్రోఫైనాన్స్ సంస్థల అవసరం ఎవరికి ఉండదు. కాళ్ళకూరు, ఆకివీడు సమావేశాల్లో జేపీ మాట్లాడుతూ ప్రభుత్వాలు నిరంకుశ విధానాలతో రైతులను కష్టాల్లోకి నెడుతున్నాయన్నారు. గోదాములు నిండా నిల్వలు ఉంటే బియ్యం ఎగుమతులకు అనుమతులు ఇవ్వడం లేదు. జిల్లాలో ఫంగేసియస్ రకం చేప రూ.50 ఉంటే ఇప్పుడు రూ.30 చేరుకుంది. ఇదంతా ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న చేపల వల్ల జరుగుతోంది. ఈ తరహాలో దేశీయ రైతు ప్రయోజనాలు పట్టకుండా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి.

### మరో విప్లవం రావాలి

హరిత విప్లవం దేశంలో మొదటిసారిగా జిల్లాలోనే మొదలైంది. గోదావరి జిల్లాలోనే రైతు విలవిలాడుతున్నాడంటే, నీటి వనరులు లేని చోట ఎంత ఇబ్బందికర పరిస్థితో ఆలోచించాలి. గ్రామీణ భారతాన్ని సంక్షోభం నుంచి బయటపడేయడానికి అంతా సమిష్టిగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. దేశవ్యాప్తంగా అన్ని వర్గాలను కలుపుకుని ముందుకెళతాం. అందరిని సంఘటితపరచి రైతుని కష్టాల కడలి నుంచి బయటపడేస్తాం.

### వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలి

ఆకివీడు : దేశ ఆర్థిక వ్యవస్థ, పిల్లల భవిష్యత్తు వ్యవసాయరంగం మీద ఆధారపడి ఉంది. లక్షలాది టన్నుల ధాన్యం ఉత్పత్తులు సముద్రం పాలవుతున్న ప్రభుత్వం చొరవచూపడం లేదు. విదేశాలకు బియ్యం ఎగుమతులకు అవకాశం ఇవ్వడం లేదు. కార్యక్రమంలో రైతు నాయకులు నాగిరెడ్డి, ఎర్నేని నాగేంద్ర. జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల జానకీరామరాజు, టీడీపీ జడ్పీ ఫ్లోర్ లీడర్ ముత్యాలరత్నం, బొబ్బిలి బంగారయ్య, డీవీ రమణమూర్తి, రైతులు పలువురు పాల్గొన్నారు. ★



# ఖమ్మం

## రైతులకు స్వేచ్ఛా మార్కెట్ కావాలి

**సత్తుపల్లి :** స్వేచ్ఛా మార్కెట్ రైతులకు ఏర్పాటైనప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది. సత్తుపల్లి కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరిగిన అఖిలపక్ష, రాజకీయ నాయకులు, రైతుల ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో జేపీ ప్రసంగించారు. ప్రస్తుతం ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర సరిపోదు. మరో రూ. 200 బోనస్ ప్రకటించాలి. కలెక్టర్ ఆధ్వర్యంలో రైతులతో కమిటీలు ఏర్పాటు చేసి కొనుగోళ్ళు డబ్బు చెల్లింపులు జరపాలి. ఎగుమతులను అనుమతించి దిగుమతులను నిషేధించాలి. ఆహార భద్రత అవసరం. పేదలకు చౌకగా బియ్యం అందించాలి. అవసరాలకు సరిపడా బియ్యం సేకరించాలి. పామాయిల్‌తో సహా ఇతర నూనె పంటలు, పంచదార తదితర ఆహార దిగుమతులపై విధిగా సుంకం విధించి ఆ ఆదాయాన్ని రైతులకు రాయితీ ఇవ్వాలి. ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి. ఈ పథకంలో 50 శాతం సొమ్మును వ్యవసాయ పనులకు ఖర్చు చేయాలి. రైతులంతా ధాన్యం సమస్యలపై ఒక్కటి కాగలిగితే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఈ ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర కారదర్శి రవిమారుత్, అఖిలపక్ష రాజకీయ నాయకులు తెదేపా నుండి బండి గుర్నాధరెడ్డి, కొత్తూరు ప్రభాకరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గోకినపల్లి వెంకటేశ్వరరావు, వెంకన్న, కాంగ్రెస్ నాయకులు మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, కోటగిరి మురళీకృష్ణారావు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు జూపెల్లి సత్యనారాయణ, పార్టీ నాయకులు సామినేని రాఘవులు, చింతల లింగేశ్వరరావు, ఆంజనేయులు, పుల్లారావు, భద్రూనాయక్, జాడి చొక్కారావు, సత్తుపల్లి లోక్‌సత్తా నాయకులు చేబ్రోలు వెంకటేశ్వరరావు, బొబ్బిలి జోసఫ్, రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని బతికించేందుకు ధర్మపోరాటం

**వైరా:** అన్ని అవకాశాలు ఉన్నా అట్టడుగు స్థానానికి వెళ్తున్న వ్యవసాయాన్ని బతికించేందుకు ఈ ధర్మపోరాటం చేస్తున్నాం. ఈ ప్రయత్నంలో రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలి. వైరాలోని కామిశెట్టి కల్యాణమండపంలో రైతులతో జరిగిన ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో ప్రభుత్వ సంస్థల ద్వారా ధాన్యం, బియ్యంను సేకరించి విదేశాలకు ఎగుమతి చేస్తే వేల కోట్లు ఆదాయం వస్తుంది. వీటిని మళ్లీ రైతులకు మెరుగైన మద్ధతు ధర కల్పించేందుకు ఉపయోగించవచ్చు. ఎగుమతి చేయాలంటే ఆంక్షలు, పన్నులు విధిస్తున్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలంటే అవేమీ ఉండటం లేదు. దీంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.

రాస్తారోకోలు, ధర్నాలు వంటి ప్రజాసంక్షోభ కార్యక్రమాలకు లోక్‌సత్తా వ్యతిరేకం. కానీ రైతుల గోడు తెలియాలంటే నిర్దిష్టంగా రెండు, మూడు రోజులు కేవలం పరిశ్రమల ఉత్పత్తులను మాత్రమే ఎక్కడికి వెళ్లకుండా నిలుపుదల చేస్తే దాని ప్రభావం ప్రభుత్వాలకు తెలుస్తుంది. ప్రస్తుతం అమలులో ఉన్న పంటల బీమా విధానం వల్ల రైతులకు నష్టం జరుగుతోంది. వ్యక్తి చనిపోతే ప్రస్తుతం బీమా ఎలా అందిస్తున్నారో నష్టపోయిన రైతుకు బీమా పూర్తిగా అందేలా విధానాలు రూపొందించాలి. వ్యవసాయాన్ని బతికించేందుకు చేస్తున్న పోరాటంలో భాగంగా 40405050 అనే నెంబర్‌తో కాల్‌సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. పార్టీ జిల్లా అధ్యక్షుడు జూపల్లి సత్యనారాయణ, అధికార ప్రతినిధి సామినేని రాఘవులు, నాయకులు ఆంజనేయులు రాష్ట్ర కారదర్శి రవిమారుత్, బాలస్వామి, నరసింహారావు పాల్గొన్నారు.





# కర్ణాటక రాష్ట్రం

## రైతులపై సర్కారు యుద్ధం

- **క్రీడల కోసం రూ.70 వేల కోట్లు ఖర్చు**
- **అన్నదాతకు రూ.10 కోట్లు కేటాయించలేరా?**
- **కర్ణాటక రైతు సంఘం సమావేశంలో ప్రభుత్వాన్ని నిలదీసిన జయప్రకాష్ నారాయణ**

**రాయచూరు :**

- పాశ్చాత్య దేశాలు రైతులకు విరివిగా సబ్సిడీలు ఇచ్చి సేద్యాన్ని ప్రోత్సహిస్తుంటే మనదేశంలో ప్రభుత్వమే వ్యవసాయంపై యుద్ధం చేస్తోంది.
- మరో 6 నెలల్లో ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాలు ఎటువంటి సుంకం లేకుండా అపరిమితంగా దిగుమతి చేసుకోవచ్చని కేంద్రం నాలుగు రోజుల క్రితం ప్రకటించింది. ఇది మన రైతుల పాలిట గొడ్డలిపెట్టు కాగలదు.
- సింధనూరు పట్టణంలో కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం వరికి గిట్టుబాటు ధరపై నిర్వహించిన భారీ సమావేశంలో జయప్రకాష్ ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో రైతులు ఉద్యమిస్తేనే ప్రభుత్వాలు కళ్లు తెరచి స్పందిస్తాయి.
- రైతు ఎక్కడ ధర ఉంటే అక్కడ తన ఉత్పత్తుల్ని అమ్ముకునేలా ప్రభుత్వాలు స్వేచ్ఛ ఇవ్వాలి. అలా చేసిన ఆనాటి నుంచి 20 ఏళ్లలో భారత్ చైనాకు ధీటుగా నిలబడుతుంది.
- 15 రోజుల కామన్వెల్త్ క్రీడల కోసం రూ.70 వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం కష్టాల్లో ఉన్న రైతు కోసం కేవలం రూ.10 కోట్లు వెచ్చించలేక పోతోంది. బస్తా ధాన్యానికి రైతుకు చెల్లించే రూ. వెయ్యి ధరను రూ.1500 లకు పెంచితే వారి కష్టాలు గట్టెక్కుతాయి. తొలుత 'రైతు బాంధవరిగె హార్ధిక శుభాశయ' అంటూ కన్నడంలో ప్రసంగం ప్రారంభించిన జయప్రకాష్ ... మనది రైతు కులం, రైతు భాష, అంటూ కొన్ని పదాలు కన్నడలోనే మాట్లాడుతూ 'నాకింత వరకే కన్నడ వస్తుంది తెలుగులో ప్రసంగిస్తా' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. జేపీ ప్రసంగాన్ని రైతులు ఆద్యంతం ఆసక్తిగా విన్నారు.

## పంటల బీమా పథకం బోగస్ : జేపీ

**రాయచూరు :**

- పంటల బీమా పథకంలో ప్రీమియం కట్టించుకుంటున్నా దాని వల్ల రైతులకు ప్రయోజనం లేదు.
- రైతులు ఎన్నో అవరోధాలు అధిగమించి పంటలు పండిస్తున్నారు. నిలకడలేని ధరలు, ముందు చూపులేని ప్రభుత్వ విధానాల వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇదిలాగే కొనసాగితే వ్యవసాయం తీవ్ర సంక్షోభం ఎదుర్కోక తప్పదు.
- 1984లో పత్తి మూడేళ్ల క్రితం చక్కెర విషయంలో ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు నష్టపోయారు. జాతీయ ఉపాధి పథకాన్ని వ్యవసాయంతో ముడిపెడితే రైతులకు ఊరట లభిస్తుంది.
- వ్యవసాయ వ్యవసాయేతర రంగాల ఆదాయం మధ్య అంతరాలు తొలగినపుడే రైతు సుభిక్షంగా ఉంటారు.
- రైల్వే తరహాలో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ తేవడం వల్ల ఒనగూరేది ఏమి లేదు. రెండు దశాబ్దాల క్రితం పారిశ్రామిక రంగం పురోగతికి తీసుకున్న నిర్ణయాలు తీసుకుంటేనే వ్యవసాయం ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు దొరుకుతాయి.

## ధాన్యం కనీస మద్దతు ధర రూ.1500 లకు పెంచాలి

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న అసంబద్ధ వైఖరి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అంతర్జాతీయ మార్కెట్ ధాన్యం ధరలు క్వింటాలుకు 12 వేల నుంచి 14 వేల వరకు అమ్ముతుండగా రైతులుకు మాత్రం వేయి రూపాయలకు మించి లభించకపోవటం శోచనీయం. కేంద్ర

ప్రభుత్వం నేరుగా స్టేట్ ట్రేడింగ్ ద్వారా రైతు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలి. ప్రస్తుతం దేశంలోని గోదాముల్లో వంద మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు మగ్గుతున్నాయి. వీటిలో దేశఅవసరాలకు 60 శాతం పోనూ, మిగతా 40 శాతం ధాన్యాన్ని అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించవచ్చు. ఇదిలా ఉండగా బాసుమతి రైస్ తప్ప, మిగతా సన్న బియ్యం ఎగుమతుల పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడం వల్ల దేశీయ మార్కెట్‌లో ధాన్యం ధరలు కనీస స్థాయికి పడిపోయాయి.

- దేశంలో పండుతున్న ఆహార ధాన్యాల్లో స్థానిక అవసరాలకు మినహాయించి, మిగతా ధాన్యం ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతులకే చెందే విధంగా శాస్త్రీయ విధానాన్ని రూపొందించాలి. దేశ జనభాలో 70 శాతం మంది ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని పరిపుష్టం చేయవలసిన అవసరముంది.
- రైతులు నష్టాల పాలు కావడం వల్లే గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరిగాయి. గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.
- దేశవ్యాప్తంగా ఉన్న రైతులు, రైతు సంఘాలతో చర్చించిన అనంతరం రైతు బృందంతో కలిసి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం. రోగనిరోధక శక్తి గల బీటీ విత్తనం ద్వార రైతులు అధిక ఉత్పత్తిని సాధించారు.
- వాతావరణంలో వస్తున్న మార్పుల కనుగుణంగా శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించాలి. తద్వార దేశానికి వెన్నెముకలాంటి రైతులను ఆదుకోవలసిన అవసరముంది.

## సింధనూరు అల్లుడు జేపీకి ఘన స్వాగతం

**సింధనూరు :** లోక్‌సత్తా పార్టీ కన్వీనరు సింధనూరు అల్లుడైన జయప్రకాష్ నారాయణ్‌కు నవంబర్3న పట్టణంలో ఘనస్వాగతం లభించింది. రాయచూరు సాత్‌మైల్ క్రాస్ నుంచి ఆయన అభిమానులు ఊరేగింపుగా తీసుకొచ్చి సంధనూరు ఐబీ వరకు సాగనంపారు. ఐబీలో తాలూకా తెలుగు ప్రముఖులు ఎన్.వి. సత్యనారాయణ, బూరుగపల్లి శ్రీహర్ష, విజయచౌదరి, గ్రీన్‌గోల్, శ్రీనివాస్, బుద్ధ నారాయణమూర్తి, ఎన్, వెంకటేశ్వరరావు, గారపాటి సాయి రామకృష్ణ తదితరులు జేపీని పూలహారాలతో ముంచెత్తారు. అక్కడే ఆయన కర్ణాటక రైతు నేతలతో తొలుత సుదీర్ఘంగా చర్చలు జరిపారు. జేపీ వెంట ఆయన మామగారు, వరలక్ష్మి, పత్తి వంగడం సృష్టికర్త పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, ఫౌండేషన్ అవార్డు గ్రహీత కె. పాపారావు కూడా ఉన్నారు.

## సేద్యం లేకుంటే దేశమే లేదు

**సింధనూరు :** 'వ్యవసాయమే లేకపోతే ఈ దేశమే లేదు. అన్ని రంగాలు వ్యవసాయంపైనే ఆధారపడ్డాయి'. అని మాజీ ఎంపీ, ఆంధ్రప్రదేశ్ రైతు సమాఖ్య నేత యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. రోజంతా సింధనూరు పట్టణం రైతులతోనే కిటకిటలాడింది. కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం నేతలే కాకుండా స్థానికంగా అన్ని క్యాంపుల నుంచీ తెలుగు రైతులు వచ్చారు.

సభలో శివాజీ మాట్లాడుతూ ధాన్యం అమ్మే రైతుకి బస్తాకి రూ1000 దక్కితే దాన్ని బియ్యంగా చేసి అమ్ముతున్న వ్యక్తి రూ 3 వేలు లభిస్తున్నాయని ఇదేం చోద్యమని ప్రశ్నించారు. రైతులే గనుక వ్యవసాయం మానేస్తే ప్రధాని, కేంద్ర మంత్రులు వచ్చి సాగుబళ్లు చేస్తారా? అంటూ ఎద్దేవా చేయడంతో సభంతా చప్పట్ల మయమైంది. సభలో రైతు సంఘం అధ్యక్షుడు పుట్టణ్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రిసార్టు రాజకీయాలు సాగుతున్నాయని ధ్వజమెత్తారు. రైతు సంఘం కార్యధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ కోట్లకు అమ్ముడు పోతున్న ఎమ్మెల్యేల్ని అసెంబ్లీకి పంపడం సిగ్గుచేటని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సమాఖ్య నాయకులు నాగేంద్రనాథ్ మాట్లాడుతూ ఎగుమతులు, దిగుమతుల విధానాల్లో మార్పులు రావాలన్నారు. ఎమ్మెల్యే నాడగౌడ, కర్ణాటక రైతు సంఘం ఉపాధ్యక్షుడు చామరస్ మాలిపాటిల్, ఎన్.కె.వి. వాసుదేవరావు, తుల్యానందరావు, కేశవరావు, నిమ్మలపూడి మధు, అబ్బు, కె. పాపారావు, కమ్మ సంఘం అధ్యక్షుడు బలుసు సుబ్రహ్మణ్యం, గంగావతి, రాయచూరు ప్రముఖులు గారపాటి రామకృష్ణ, సూర్యదేవర నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. ★

### రైతు ఐక్యతాయాత్రలో సేకరించవలసిన వివరాల నమూనా

# రైతుల ఐక్యతా యాత్ర

### రైతువేదిక పట్ల ఆసక్తి గల రైతులు - కౌలుదార్ల పేర్లు

**జిల్లా :............................................. మండలం :.............................................**

| గ్రామం పేరు | రైతు/కౌలుదార్లు పేర్లు | టెలిఫోన్ నెంబర్లు, సెల్ నెంబర్లు | ఇతరాలు |
|---|---|---|---|
| | | | |



# నల్గొండ

## విత్తనం నుంచి దిగుబడి వరకు రైతుకు అన్నీ కష్టాలే

**కోదాడ :** ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్లే రైతులకు కనీస గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక ఎకరాకు అయ్యే పెట్టుబడి, దిగుమతి, మిగులు, తదితర అంశాలను ఆయన పలు రైతుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు పారిశ్రామిక రంగానికి ఇచ్చిన చేయూత, వ్యవసాయ రంగానికి ఇవ్వకపోవటంతో రైతులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి కనీస సదుపాయాలు, మద్దతు ధర ప్రభుత్వాలు కల్పించకపోవటంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. ఇప్పటికి 4.60 లక్షల టన్నుల బియ్యం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గోడౌన్లలో ఉన్నాయని, డిసెంబర్ నాటికి పీడీఎఫ్ బియ్యం కింద 1.60 లక్షల టన్నుల బియ్యం మాత్రమే అందించాల్సి ఉంటుందని పేర్కొంటూ మూడు రెట్ల బియ్యాన్ని స్టాకు పెట్టుకొన్న ప్రభుత్వం ఈ డిసెంబర్ నుంచి వచ్చే ఖరీఫ్ ధాన్యాన్ని ఏ విధంగా కొనుగోలు చేస్తుందని ఆయన ప్రశ్నించారు.

## రైతులు వ్యాపార దక్షత పెంచుకోవాలి

రైతాంగం తమ వృత్తిని కాపాడుకునే ప్రయత్నంలో నష్టాలు వస్తున్నా వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారని ఇది సరైంది కాదని, ఇప్పటికైనా రైతులు వ్యాపార దృక్పదంతో వ్యవసాయాన్ని చేపట్టాలని జయప్రకాష్ నారాయణ్ సూచించారు. వ్యవసాయాన్ని వ్యాపార దృక్పదంతో చేపట్టినప్పుడే రైతులకు ఆర్థిక స్వావలంభన లభిస్తుందన్నారు. బీజేపీ కన్వీనర్ బలిశెట్టి కృష్ణయ్య, కనగాల జనార్ధన్‌రావు, సైదానాయక్, బసవయ్య పాల్గొన్నారు.

## వ్యవసాయంపై నిర్లక్ష్యం తగదు

**కోదాడటౌన్ :** కోదాడ గ్రామపంచాయతీ కార్యాలయంలో కోదాడ, చిలుకూరు, నడిగూడెం మండలాల రైతులతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడారు. వరి, చెరకు, పత్తి రైతులసాధక బాధకాలు, ఆ పంటల ఉత్పత్తి వ్యయం, పంటలకు లభిస్తున్న ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలం నుండి 15 మంది రైతులు సంఘంగా ఏర్పడి రైతులను చైతన్యం చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు లాభసాటి ధర ప్రకటించాలన్నారు. నిల్వలను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించడం ద్వారా గిడ్డంగులను ఖాళీ చేయించాలన్నారు. 30 లక్షల టన్నుల సామర్థ్యంతో కొత్తగా గిడ్డంగులను నిర్మించాలన్నారు. పంటలకు లాభసాటి ధర రాకపోతే వారి కొనుగోలు శక్తి పడిపోతుందని, తద్వారా పారిశ్రామిక ఉత్పత్తి మందగిస్తుందన్నారు. దీంతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు రెండూ నాశనమైపోతాయని విశ్లేషించారు. రైతు సంక్షేమం కోసం పంటలకు లాభసాటి ధరల కోసం దశలవారీగా ఉద్యమం నిర్వహించాలన్నారు. మొదటి కార్యక్రమంగా ప్రధాన మంత్రికి రెండుకోట్ల పోస్టుకార్డులు పంపడం, తర్వాత ఒక రూపాయి, మని అర్డర్ చేయాలన్నారు, అనంతరం రోడ్డు రైలు మార్గాల్లో సరుకు రవాణాను స్తంభింపచేసే కార్యక్రమాలు ఉంటాయన్నారు. పేదలకు పరిమితి సౌకర్యం కల్పించలేక ప్రభుత్వం చేతులెత్తేయడంతోనే సూక్ష్మరుణ సంస్థలు పుట్టుకొచ్చాయన్నారు. వరంగల్, కరీంనగర్

జిల్లాల్లో మహిళా సమాఖ్యలు ఏర్పడి తమ పొదుపుతో తమ మధ్యే రుణాలిచ్చుకుంటూ తద్వారా వచ్చిన లాభాలను వారే పంచుకుంటున్నారు. సమావేశంలో కోదాడ మాజీ సర్పంచులు పయిడిమర్రి సత్యబాబు, ఎర్నేని బాబు, పారసీతయ్య, లోక్‌సత్తా పార్టీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ పి.భాస్కర్‌రావు, కోదాడ నియోజకవర్గ బాధ్యుడు సాతులూరి గోవిందరావు, గొండ్రియాల సర్పంచ్ వంకాయల పాటి నర్సయ్య, సైదా నాయక్, కోమటి నాగేశ్వరరావు, మంకెన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### యువత వ్యవసాయంపై దృష్టి సారించాలి

రాష్ట్రంలో వ్యవసాయాన్ని ప్రభుత్వం క్రమంగా చంపేస్తోంది. ఈ రంగంపై ఆధారపడిన 60శాతం మంది ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. యువత కూడా వ్యవసాయ రంగంపై దృష్టి సారించాలని కోరారు. రైతుల సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ అధ్యక్షులు అచ్యుత్‌రావు ఎస్వీ కళాశాల కరస్పాండెంట్ ఎం.సైదేశ్వరరావు, తదితరులున్నారు.

### నష్టపరిహారం పంపిణీలో ఒకే విధానం

**సూర్యాపేట రూరల్ :** జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం పంపిణీలో దేశవ్యాప్తంగా ఒకే విధానం అమలు చేయాలని లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ ప్రభుత్వానికి సూచించారు. రాయనిగూడెం సమీపంలో ఆయన మట్లాడుతూ భూ పరిహారంలో వ్యత్యాసంపై అవసరమైతే కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన వెల్లడించారు. పలుకుబడి ఉన్న నేతలు సరిహద్దులు మార్చి అమాయకులను బలిచేసి లబ్దిపొందుతారని, అవుటర్ రింగ్‌రోడ్డు బాధితులను ఉదహరించారు.

**హుజూర్‌నగర్ :** రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలి. హుజూర్‌నగర్‌లోని ఎఫ్‌సీఐ గోదాంలో నిల్వ చేసిన ధాన్యాన్ని జేపీ పరిశీలించారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఆంక్షలు పెట్టి రైతాంగానికి సంకెళ్ళు వేస్తున్నారని ఆరోపించారు. మన ధాన్యాన్ని పక్క రాష్ట్రాలకు కూడా అమ్ముకునేందుకు వీలు లేకుండా ఆంక్షలు పెట్టడంతో రైతులకు మద్దతు ధర లేకుండా పోయిందని ఆరోపించారు. సన్నరకం ధాన్యానికి అంతర్జాతీయ మార్కెట్‌లో పెద్ద ఎత్తున ధరలు పలుకుతున్నాయన్నారు. ఆర్థిక వేత్త ప్రధానమంత్రిగా ఉన్నా రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రెండు జిల్లాలో ఓట్ల ఖర్చుతో రాష్ట్రంలో రైతులకు అవసరమైన గోదాంలను నిర్మించవచ్చున్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నియోజక వర్గ ఇన్‌చార్జ్ కడియం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

**హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్‌లోని మిర్యాలగూడ రోడ్డులో ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములను లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణ్ గారు పరిశీలించారు. అక్కడ ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎగుమతి, దిగుమతి విషయాలతో పాటు కూలిరేట్లు ఏ విధంగా చెల్లిస్తున్నారని హమాలీలను అడిగి తెలుసుకున్నారు.

### భూమిని సేకరించి బాధితులకు ఇవ్వాలి

**గరిడేపల్లి :** విత్తనం నుండి పంట వచ్చే వరకు రైతుకు అన్ని కష్టాలేనని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. గరిడేపల్లిలో రైతు ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులను కష్టాల పాలు చేసేది, ప్రకృతో, రైతో కాదని కేవలం ప్రభుత్వ ఆర్థిక విధానాలేనని ఆరోపించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం శ్రీనివాసరెడ్డి, తాటికొండ సత్యనారాయణ రెడ్డి, ఘంటా గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

**గరిడేపల్లి :** రైతులతో నిర్వహించే ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొనేందుకు గరిగేపల్లికి వచ్చిన లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణ్‌ను తెలంగాణ పట్ల తన వైఖరిని తెలపాలని కోరుతూ తెలంగాణ నాయకులు అడ్డుకున్నారు. కొల్లేరు సమస్యపై సుదీర్ఘమైన పోరాటం చేసిన మీరు తెలంగాణ ప్రాంత సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. సాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు రైతులకు నీరందని పరిస్థితిపై, కుడికాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాల నిర్వహణను ప్రభుత్వమే చేపడుతుందని, ఎడమ కాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ఎందుకు చేపట్టడం లేదనే తదితర విషయాలపై పోరాటం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణపై మీ వైఖరి స్పష్టం చేయాలని తెలంగాణవాదులు నినదించారు. జయప్రకాష్‌నారాయణ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. తెలంగాణపై తన వైఖరి గతంలో ప్రకటించిన విధంగానే ఉంటుందని, ఒక్కొక్క ప్రాంతంలో ఒకరకంగా ఉండదన్నారు. దీంతో తెలంగాణవాదులు తెలంగాణ అమరవీరులకు మౌనం పాటించాలని కోరగా జయప్రకాష్‌నారాయణ రెండు నిమిషాలు మౌనం పాటించారు. జేపీ ఇది తెలుగు భూమి.. తెలుగు నేల.. నేను తెలుగువాడినే.. కానీ తెలంగాణకు వ్యతిరేకిని కానంటూ తెలంగాణ వాదులకు సమాధాన పరచడంతో వారు వేదిక వద్ద నుండి వెళ్లిపోయారు.

**వేములపల్లి :** వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు సాధించేందుకు రాష్ట్ర రైతాంగం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని జయప్రకాష్‌నారాయణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు మారేపల్లి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మద్ది వెంకటేశ్వర్లు, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుతుబుద్దీన్, వెంకన్న ఉన్నారు. ★




# తూర్పు గోదావరి

- **మార్పు తప్పక వస్తుంది. నిరాశ వద్దు...సమాచార హక్కు చట్టం ఉపయోగించి అక్రమాలు బయట పెట్టండి...**
- **మేధావులు, యువజన సదస్సులో జేపీ**

***సమాజంలో మార్పు ఖచ్చితంగా వస్తుంది. అది రావడానికి యువత, మేధావులు చేయిచేయి కలపాలి. నిరాశవీడి.. కసి, ఆవేశం, ఆలోచన, ప్రణాళికలతో మనం అనుకున్న సమాజాన్ని సాధిద్దాం... అంటూ జేపీ యువతకు పిలుపునిచ్చారు. నిరాశ, పిరికితనం వదిలి సమాజహితం కోసం యువత కొంతైనా దృష్టి సారించాలన్నారు.***

**రాజమండ్రి :** వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయింది. అంతా అవినీతి పరులైపోయారు.. .మనం ఏంచేసినా ఈ సమాజాన్ని బాగుపరచలేం.. అంటూ నిరాశ చెందకండి. మంచి పనిచేస్తున్న ఎవరికైనా చేయూతనివ్వండి. ముందు మీ జీవితాలను సక్రమంగా తీర్చిదిద్దుకుంటూ.. వ్యవస్థలో మీ వంతు సహకారం అందించండి. కారుచీకట్లో కూడా దీపస్తంభాన్ని చూసే శక్తినాకుంది. ఖచ్చితంగా ఈ వ్యవస్థలో మార్పు వస్తుంది. మా తరం ఈ మార్పును చూస్తుంది. మీ తరం అనుభవిస్తుంది... అంటూ లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ యువతలో స్ఫూర్తిని నింపారు. రాజమండ్రి ఆనం కళాకేంద్రంలో యువత, మేధావుల సదస్సులో జేపీ పాల్గని ప్రసంగించారు. 1700 సంవత్సరాల వరకు ప్రపంచంలో మనమే ముందున్నాం.. అలాంటిది.. తర్వాత క్రమక్రమంగా వ్యవస్థ దెబ్బతిని వెనుకబడి పోయాం. మళ్లీ మనకు పూర్వవైభవం వస్తుంది. మరో పదేళ్లలో మన ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. సమాజంలో మార్పు ఖచ్చితంగా వస్తుంది. అది రావడానికి యువత, మేధావులు చేయిచేయి కలపాలి. నిరాశవీడి.. కసి, ఆవేశం, ఆలోచన, ప్రణాళికలతో మనం అనుకున్న సమాజాన్ని సాధిద్దాం... అంటూ జెపి యువతకు పిలుపునిచ్చారు. నిరాశ, పిరికితనం వదిలి సమాజహితానికి యువత కొంతైనా దృష్టి సారించాలన్నారు.

ఆరోజుల్లో నెలకి లక్షా ఏభైవేల రూపాయలు సంపాదించే టంగుటూరి ప్రకాశం పంతులు రాజకీయాలలోకి వచ్చి తన యావదాస్తినీ వెచ్చించారని చివరికి పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గాంధీ, పటేల్, అంబేద్కర్ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగి పోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సమాచార హక్కు చట్టం వంటి వాటిని ఉపయోగించి అవినీతి, అక్రమాలను బయట పెట్టడంలో యువత నడుంబిగించాలని జేపీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

సదస్సులో పాల్గొన్న మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ.. అవినీతి నిర్మూలన గురించి మాట్లాడితే కొంతమంది హేళన చేస్తున్నారని... ఈ విషయంలో

ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రతినిధుల అక్రమాలపై విచారణను చట్టపరంగా చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. లెఫ్ట్ నెంట్ జాస్తి మూర్తి మాట్లాడుతూ.. మాతృదేశం కీర్తి ప్రతిష్టలు, సంక్షేమం గురించి ఆలోచించిన తర్వాతే ఏదైనా ఆలోచించాలన్నారు. ఆలోచన, నిబద్ధతగల పౌరులు సమాజాన్ని మార్చే శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారన్నారు. 18 సంవత్సరాల క్రితం ఢిల్లీ ఎయిర్ పోర్టులో జేపీతో కలిసిన సమయంలో ఆయన మాటలకు స్ఫూరిపొందిన వైనాన్ని మూర్తి ఈ సదస్సులో ఆసక్తికరంగా వివరించారు. ఈసందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ... నగరంలో ఉన్న 50 కళాశాలల విద్యార్థులు 50 వార్డులను తీసుకుని.. వచ్చే కార్పొరేషన్ ఎన్నికలలో మంచివారిని ఎన్నుకుని..ఇక్కడ నుంచే ఓ ఉద్యమానికి నాందిపలకాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియలో తనవంతు సహకారం ఉంటుందన్నారు.

### అవినీతి పరుల్ని జైల్లో పెట్టాలి

అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జేపీ సూచించారు. అవినీతి పరులను జైల్లో పెట్టి ఆస్తులు జప్తు చేయాలన్నారు. అవినీతి పరులకు శిక్షలు పడకపోవడం వల్లే విచ్చలవిడితం పెరిగిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని దోచుకునేవాళ్లకు కిరీటం పెట్టే సంస్కృతి విడనాడాలన్నారు. ప్రజలు మత్తులో జోగితే ఓట్లు దండుకోవచ్చన్న రాజకీయనేతలకు బుద్ధి చెప్పాలని యువతకు పిలుపునిచ్చారు.

అవినీతి నియంత్రణ వ్యవస్థను పటిష్టం చేయడానికి జాతీయస్థాయిలో స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటుచేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మేధావులు జయప్రకాష్‌నారాయణ్‌ను కొన్ని ప్రశ్నలు వేసి తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. లోక్‌సత్తా నేతలు డాక్టర్ వి.వి. రామారావు, విజయకుమార్, వైడిరామారావు, చంద్రకళ, సూర్యారావు, రవి, శంకర్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### రైతు సమస్యలపై ధర్మయుద్ధం

**సామర్లకోట :** ఆరుగాలం శ్రమించి పంట పండించి పది మందికి అన్నం పెట్టే రైతు సమస్యలపై ధర్మయుద్ధం చేద్దాం. మండలంలోని వేట్లపాలెం, బేతాళగుడి ఆవరణలో జయప్రకాష్‌నారాయణ్ రైతులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సమస్యలపై ప్రసంగించారు. రైతుల సమస్యలపైనా, సాగులో వారు ఎదుర్కొంటున్న కష్టాలపైనా చర్చించారు. వేదికపై లోక్‌సత్తా జిల్లా నాయకులు యార్లగడ్డ దశరధ రామారావు, వేట్లపాలెం ఉప సర్పంచ్ గోలి వెంకట్రావు, రైతు ప్రతినిధులు కొండపల్లి త్రినాథ గంగాధర రామారావు, కొండపల్లి రాజబ్బాయి, యార్లగడ్డ బాపినీడు, కాకినాడ పార్లమెంటరీ లోక్‌సత్తా ప్రతినిధి కె.వెంకటేశ్వరరావు. పాలచర్ల రామకృష్ణ చౌదరి ఉన్నారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు గోలి పద్మరాజు, కొండపల్లి సూరన్న చౌదరి, గుణ్ణం వెంకట్రావు, కొండపల్లి జగ్గారావు పాల్గొన్నారు.

**పెదపూడి:** పెదపూడిలోని రైతులతో కూడా జయప్రకాష్‌నారాయణ ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ధాన్యానికి ప్రభుత్వం మరో రూ॥200 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కరరావు, శ్రీనివాస్, ఎంపీపీ మార్నికామరాజు, సర్పంచ్ మార్ని పెద్దబ్బు, నీటి సంఘ అధ్యక్షుడు పి.సాయి ప్రసాద్, మేకా రామకృష్ణ పాల్గొన్నారు.

**కె.గంగవరం :** కె.గంగవరంలో శివాలయం వద్ద రైతులతో జయప్రకాష్‌నారాయణ ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఇప్పుడు చేపట్టిన ధర్మయుద్ధం పంటలకు మద్దతు ధర, రైతుల లాభాలకు స్వేచ్ఛామార్కెట్, దేశానికి ఆహార భద్రత, పేదలకు చౌకగా బియ్యం తదితర లక్ష్యాలతో సాగుతుంది. దీనిని ముందుకు నడపడానికి కుల, మత, పార్టీలకు అతీతంగా రైతులు కదలిరావాలన్నారు. ప్రస్తుతం రైతులు కష్టమైన వ్యవసాయం అనే వ్యాపారం చేస్తున్నారు. లాభాలు సాధించాలనేది వారి కోరిక కానీ ప్రభుత్వం నిర్ణయాలతో గిట్టుబాటు ధరలు కూడా రావడంలేదు. జనాభాలో 60 శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ రంగం లాభదాయకమైతే మొత్తం సమాజమే లాభపడుతుంది. ఇష్టాగోష్ఠిలో రైతులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఎంపీల జీతాలు పెంచేందుకు ప్రభుత్వం వద్ద సొమ్ములు ఉన్నాయి, కానీ రైతులకు మద్దతు ధర ఇవ్వడానికి లేవని దంగేరుకు చెందిన రావిపాటి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో రైతులు సంఘాలుగా ఏర్పడి ఉద్యమాన్ని ముందుకు నడపాలని యండగండికి చెందిన చోడే గాంధీ కోరారు.

నకిలీ విత్తనాలు, పురుగ మందులను అరికట్టాలని రైతు సమస్యలపై జయప్రకాష్‌నారాయణ అసెంబ్లీలో మాట్లాడాలని గంగవరం గ్రామానికి చెందిన అల్లూరి దొరబాబు అన్నారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా ఉద్యమాన్ని ముందుకు నడపాలని ఏకపక్షంగా నిర్ణయించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైడిరామారావు, నాయకులు దవివియస్ వర్మ, దేవరపల్లి రామకృష్ణ, సర్పంచులు తటపట్ల ఆనందరావు, రావిపాటి వెంకటగణేష్‌చౌదరి, నెక్కంటి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం :** మండల పరిధి అంగరలో జరిగిన రైతుల ఇష్టాగోష్ఠిలో జయప్రకాష్‌నారాయణ్ ప్రసంగించారు. పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పివివిఎస్ రామకృష్ణ అధ్యక్షతన స్థానిక కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో తొలుత రైతాంగ సమస్యలపై చర్చించారు. కష్టపడి పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర సాధించుకునేందుకు రాజకీయాలకు అతీతంగా రైతులు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.చంద్రమౌళి, జిల్లా ఇన్‌చార్జి జి.రామరాజు, సర్పంచ్ ఎస్.స్వామికాపు, ఎంపీటీసీ సభ్యుడు ఎం.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

## ప్రస్తావిస్తూ.... విశ్లేషిస్తూ....
## ఆద్యంతం ఆకట్టుకున్న జేపీ పర్యటన

**రాజమండ్రి :** రాజమండ్రిలో జరిగిన లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ (జేపీ) పర్యటన ఆద్యంతం వైవిధ్యంగా విశ్లేషణాత్మకంగా సాగింది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావిస్తూ... విశ్లేషిస్తూ.. పరిష్కారాలు సూచిస్తూ జేపీ చేసిన ప్రసంగాలకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం వ్యవసాయరంగం సంక్షోభానికి ప్రభుత్వ వైఫల్యం ఎంతమేర ఉందో వివరించిన జేపీ వాటికి పరిష్కారాలను కూడా వివరించే ప్రయత్నం చేశారు. జాతీయస్థాయిలో ఉద్యమించేందుకు రైతులు సమాయత్తం కావాలని, పోస్టుకార్డుల ద్వారా వినూత్నరీతిలో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. రైతులతో మాట్లాడి వ్యవసాయం ద్వారా వారికి ఏ మేరకు గిట్టుబాటు అవుతుందో తెలుసుకునే ప్రయత్నం చేశారు.

### యువతలో మార్పు రావాలి

మరోవైపు యువకులు మేధావులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అందరం కలిసి ఏ విధంగా సమాజానికి మేలు చేయవచ్చో వివరించారు. ఆనం కళాకేంద్రంలో జరిగిన సమావేశానికి మంచి స్పందన లభించింది. నగరంలోని పలు కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, లెఫ్టినెంట్ జాస్తిమూర్తి, ఓఎన్‌జీసీ రిటైర్డ్ జీఎం విజయకుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. వీరంతా యువతలో మార్పును ఆకాంక్షించారు. ఈ తరం కన్నా మా తరం గొప్పదనే పెద్దలను మీరు గొప్పవారైతే సమాజం ఎందుకిలా ఉందని ప్రశ్నించండని జేపీ యువతకు సూచించినప్పుడు వారి నుంచి కేరింతలతో స్పందన వచ్చింది. ప్రస్తుత భారతంలో మీ ప్రమేయం లేదు. భవిష్యత్తు భారతాన్ని అందంగా తీర్చిదిద్దుకోవడం లో మీరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### మీ పోరాటస్ఫూర్తికి అభినందనలు

మిర్తిపాడులో మద్యంపై ఉద్యమిస్తున్న మహిళలతో మాట్లాడుతూ మీ పోరాట స్ఫూర్తికి అభినందనలు తెలిపేందుకే ఇక్కడికి వచ్చానని చెప్పారు. మిర్తిపాడులో గ్రామస్థులను ఉద్దేశించి మీ గ్రామంలో యువకులు ఎవరైనా వ్యవసాయం చేయడానికి ఇష్టపడుతున్నారా అని ప్రశ్నించగా ఎవ్వరూ లేరనే సమాధానం వచ్చింది. ఈ పరిస్థితిని మార్చాలని జేపీ కోరారు. ప్రజలను తన ప్రసంగాల్లో మమేకం చేస్తూ వారిని ప్రశ్నిస్తూ వారికి వివరిస్తూ జేపీ పర్యటన సాగింది.

### స.హ.చ. గోడపత్రిక విడుదల

ప్రభుత్వంపైనా కటువైన పదజాలంతో జేపీ దాడికి దిగారు. సారాయిని పెంచడం, వ్యవసాయాన్ని చంపడమే ఈ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని దుయ్యబట్టారు. ప్రజలు మద్యపానానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తుంటే ప్రభుత్వం ప్రజలను ఏవిధంగానైనా తాగించడమే ఉద్యమంగా పెట్టుకుందని విమర్శించారు. ఆనం కళాకేంద్రంలో జేపీ జయభారత్ సంస్థ సమాచార హక్కు చట్టం (స.హ.చ.)పై రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. జయప్రకాష్ నారాయణ్ పర్యటనలో ఆయన వెంట పార్టీ తరపున లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.డి.రామారావు, డాక్టర్ వీవీ రామారావు, చంద్రకళ తదితరులు ఉన్నారు.

## మేలుకోకుంటే ముప్పే!

■ **వ్యవసాయరంగంలో తీవ్రసంక్షోభం అధిగమించేందుకు పరిష్కారాలు ఇవీ.. : లోక్‌సత్తా నేత జేపీ ఉద్ఘాటన**

**భారతదేశంలో ప్రస్తుతం వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితిలో మార్పు రాకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకులే ప్రమాదముందని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రాజమండ్రి పర్యటనలో వ్యవసాయరంగం సంక్షోభాన్ని గట్టెక్కించేందుకు ఆయన చేసిన విశ్లేషణాత్మక సూచనలు**

**రాజమండ్రి :** ప్రస్తుతం వ్యవసాయం రైతులకు లాభసాటిగా లేదు. జిల్లా రైతులు గత మూడు వ్యవసాయ సీజన్లలోనూ నష్టాన్నే చవిచూశారు. ఈసారి దిగుబడులు బాగున్నా గోదాముల కొరత పేరిట ధాన్యం ధరలు దిగజారే ప్రమాదముంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు జేపీ సూచించిన పరిష్కారాల్లో జిల్లాకు అన్వయించుకోదగినవి...

- ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా రూ॥200 అధికంగా చెల్లించడమే సత్వర పరిష్కారమార్గం.
  రైతులకు రాయితీలు ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అంతకన్నా ఎక్కువ స్థాయిలో నష్టాన్ని కలిగిస్తోంది. అమెరికాలో వ్యవసాయ రంగానికి 15 నుంచి 20 శాతం సబ్సిడీని అందిస్తుంటే, యూరోప్ దేశాల్లో 30 నుంచి 40 శాతం సబ్సిడీ అందుతోంది. మరి మన దేశంలో 30 నుంచి 40 శాతం నెగిటివ్ సబ్సిడీ రైతులకు అందుతోంది. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, నష్టాలను బేరీజు వేసుకుంటే వచ్చే అంతిమ ఫలితమే అగ్రిగేట్ మెషర్ ఆఫ్ సపోర్ట్ (ఏఎంఎస్). ప్రపంచ బ్యాంకు ఒప్పందంలో భాగంగా దీన్ని 10 శాతం మించకుండా రైతులకు కల్పించాలని నిర్ణయించారు.
- చాలా దేశాలు ఇంతకన్నా ఎక్కువ సబ్సిడీనే రైతులకు అందిస్తుంటే, భారత దేశంలో మాత్రం ఏఎంఎస్ కల్పించడం సంగతి అటుంచి 30 నుంచి 40 శాతం ఏకంగా నెగిటివ్ సబ్సిడీని అందిస్తోంది. ఎలాగంటే.. రైతులకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని చెప్పే ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్తును అందించకపోవడంతో లో ఓల్టేజి సమస్యలతో మోటార్లు కాలిపోయి జరిగే నష్టం కోట్ల రూపాయల్లో ఉంటోంది. అలాగే లెవీ పేరిట బలవంతంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం 3 లక్షల కోట్ల రూపాయల నష్టాన్ని దేశరైతులకు

కలిగిస్తోంది. ఎరువులపై సబ్సిడీ ఇస్తున్నామని చెప్పే ప్రభుత్వం ఫాస్పేట్, పొటాష్ వంటి ఎరువులపై సబ్సిడీ ఎత్తివేయడం, యూరియాపై తగ్గించడం చేసింది. వీటన్నింటి కారణంగా రైతులకు ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర కన్నా అదనంగా రూ॥200 బోనస్ ప్రకటిస్తేనే రైతులు గట్టెక్కే పరిస్థితి.

## వ్యవసాయ ఎగుమతుల విధానం మారాలి

దిగుమతి చేసుకునే పామాయిల్‌పై ఎలాంటి సుంకం లేదు. అదే ధాన్యం ఎగుమతులు చేస్తే ఎక్సైజ్ సుంకం, మార్కెట్ సెస్సు, రూరల్ డెవలప్‌మెంట్ సెస్సుల పేరిట 10 శాతం సుంకాన్ని వసూలు చేస్తున్నారు. మన గోదాముల్లో కోట్లాది టన్నుల బియ్యాన్ని కుళ్లబెట్టుకుంటున్నామే కానీ ఎగుమతుల విధానాన్ని సరళీకరించి విదేశీమారకద్రవ్యాన్ని ఆర్జించే దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయడం లేదు. అమెరికాలో బీపీటీ ధాన్యం కేజీ రూ॥130 నుంచి 140 ధర పలుకుతోందంటే మన బియ్యానికి విదేశాల్లో ఉండే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. పామాయిల్ వంటి వ్యవసాయ దిగుమతులపై సుంకాన్ని విధించి, ఆ మొత్తాన్ని దేశీయంగా రైతులకు సబ్సిడీ రూపంలో అందిస్తే పామాయిల్ ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించే అవకాశం ఉంటుంది.

## వింటూ.... వివరిస్తూ..... ఉద్యమ ప్రకాశం!

**కాకినాడ :** వ్యవసాయరంగం సమస్యల పరిష్కారంపై లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ చేపట్టిన జిల్లా పర్యటన హంగూ ఆర్భాటాల్లేకుండా, గంభీర గోదావరిలా హుందాగా సాగుతోంది. నవంబర్ 28న ఉదయం కాకినాడ నుంచి బయల్దేరిన జేపి వేట్లపాలెం, పెదపూడి, కె.గంగవరం, అంగర గ్రామాల్లో రైతు సంఘాల నేతలు, పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, నేతలతో 'ఇష్టాగోష్ఠి చర్చలు జరిపారు, పిల్లిని కూడా గదిలో పెట్టి కొడితే తిరుగబడుతుంది. అలాగే దోపిడీ వ్యవస్థలో వ్యవసాయాన్ని చంపేస్తున్న ప్రభుత్వాలపై రైతులంతా ఏకమై తిరగబడాలని లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ రైతన్నకు కర్తవ్య బోధ చేశారు. ఒక్కో గ్రామంలో కనీసం 20 మంది రైతుల్ని ఉద్యమం వైపు ఆకర్షించాలన్న ధ్యేయంతో ముందుకు సాగుతున్న జేపీ తన లక్ష్యం దిశగాదూసుకుపోతున్నారు. గంభీరమైన కంఠం ప్రసంగించాల్సి అంశంపై స్పష్టమైన సమాచారం, మధ్యలో చతురోక్తులు చప్పగా సుదీర్ఘంగా సాగే ప్రసంగాలు కాకుండా మధ్యమధ్యలో రైతుల్ని పలకరిస్తూ, వారినీ మాట్లాడమని ప్రోత్సహిస్తూ డాక్టర్ జేపీ ఒక్కో ప్రాంతాన్ని తన ఉద్యమం దిశగా ప్రభావితం చేస్తూ, ముందుకెళ్తున్నారు. డాక్టర్ జేపీ జిల్లాలో తొలి రోజు పర్యటనలో స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన తీరు లోక్‌సత్తా శ్రేణులకి సంతృప్తి కలిగించింది. నిరక్షరాస్యులకు కూడా సులభంగా అర్థమయ్యే భాషలో, అవసరమైన గణాంకాలతో, అప్పటికప్పుడు చిన్న చిన్న నోటిలెక్కలతో ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా రైతు ఎంత నష్టపోతున్నాడో వివరిస్తున్నారు. రైతులకు ఇప్పుడేం కావాలి? ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఉండాలి అన్న అంశాలపై సూటిగా మనసుకు హత్తుకునేలా సాగుతున్న ఆయన ప్రసంగాలు అంతా శ్రద్ధగా వింటున్నారు. ఉద్యమం దిశగా చైతన్యం పొందుతున్నారు.

## సభికులే వక్తలుగా

తొలిరోజు పర్యటనలో జేపీ అన్ని ఇష్టాగోష్ఠి సమావేశాల్లోనూ రైతుల్ని పలకరించేందుకు, వారి నుంచి సమస్యల్ని వినేందుకు ఎక్కువగా అసక్తిచూపారు. లోక్‌సత్తా అవిర్భావం నుంచీ ఏ సమస్యపై అంశం పైనైనా అన్ని విషయాలూ పరిశీలించాకే పోరాడాలని నిర్ణయం తీసుకుంటుంది. ఒక్కసారి నిర్ణయం తీసుకున్నాక... ఇక ప్రాణం పోయినా దాన్ని వదిలేది లేదు. రైతు సమస్యల పరిష్కారానికి చేసే మన పోరాటం కచ్చితంగా విజయాన్ని అందిస్తుందంటూ చెప్పడం అందర్నీ ఆకట్టుకుంది. తాను ప్రసంగించాక, మైక్ సభికులకి అందించి వాళ్లనే సమస్యలు తెలుసుకునే ప్రయత్నంచేశారు. మీ పిల్లల్ని వ్యవసాయం చేయిస్తారా? అంటే ఒక్కరు కూడా సమాధానం ఇవ్వలేదు. అలాగే, మీ ఆడపిల్లల్ని రైతుకిచ్చి పెళ్లిచేస్తారా? అన్న ప్రశ్నకూ ఒక్కరూ అవునని చెప్పలేదు అపై రూ॥10వేలు ఇస్తామంటే, హైదరాబాద్ వస్తారా? అని& ప్రశ్నిస్తే 10వేలు కాదు. ఐదు వేలిచ్చినా వచ్చేస్తాం సార్... అన్న సమాధానం వచ్చింది. దీంతో అంటే ఎంత దుర్భరంగా ఉందయ్యా వ్యవసాయం ఏడ్వలేక నవ్వుతున్నాం గానీ, భయంకరమైన విషాదం ఇది.. అంటూ ఆవేదన వెలిబుచ్చారు.

## నాలుగు మంచి మాటలు

ఇష్టాగోష్ఠి సమావేశాల్లో జేపీ యువతకు ప్రజలకు చక్కటి సందేశాలు కూడా ఇచ్చారు. యువత ప్రయోజకులయ్యాక తమకు ఇష్టమైన అమ్మాయి. అబ్బాయిని కుల, మత, ప్రాంత పట్టింపులు లేకుండా పెళ్లి చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, పెద్దవాళ్ల మాట వినొద్దని కూడా చెప్పారు. అలాగే అన్ని చోట్లా మద్యపానం మానేయండని ఉద్బోధించారు. ఇళ్లు ఒళ్లు గుల్ల చేసే దుర్వ్యసనాలకి బలి కావొద్దని హితవు చెప్పారు. ఇవన్నీ మహిళల్ని యువతను ఆకట్టుకున్నాయి.

## ఆ రోజుల్లో ఏం జరిగిందంటే...

గతంలో తాను తూర్పుగోదావరి కలెక్టర్‌గా పని చేసినప్పుడు తనకు ఎదురైన అనుభవాలు, జ్ఞాపకాల్ని రైతులతో పంచుకుంటూ వాళ్లల్లో తానూ ఒకడిననే భావన కల్పించారు. గోదావరి సీమకు ఆత్మ బంధువైన సర్ అర్దర్ కాటన్‌ను స్మరిస్తూ, గాంధీ మహాత్ముడి దారిలో పోరాడదామని చెబుతూ రైతుల్ని ఉత్తేజితుల్ని చేస్తున్నారు. నేడు రాజమండ్రి మిర్తిపాడు తదితర ప్రాంతాల్లో జరిగే ఇష్టాగోష్ఠి సమావేశాల్లో రైతులతో పాటు యువతరం ప్రతినిధులతోనూ జేపీ సమావేశం కానున్నారు. కార్యక్రమాల్లో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.యస్.వర్మ, ఉపాధ్యక్షుడు వై.డి.రామారావు, పార్టీ నేత డా॥ఆలూరి విజయలక్ష్మీ తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. ★

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

## నిజామాబాద్



**ప్రజలతో ముఖాముఖి**

నిజామాబాద్ నగరంలో ఇంటింటికి లోక్‌సత్తా ప్రజలలో ముఖాముఖి కార్యక్రమం సందర్భంగా 3వ వార్డులో పర్యటించి సమస్యలను వాటి పరిష్కారాలను ప్రజలతో చర్చిస్తున్న లోక్‌సత్తా నాయకులు ఎకె లత, దొడ్లె శేఖర్ తదితర కార్యకర్తలు.



**సభ్యత్వ నమోదు**

నిజామాబాద్ నగరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఎకె.లత మరియు మహిళాసత్తా నాయకురాళ్ళు.

## అదిలాబాద్ (తూర్పు)

**లోక్‌సత్తా వారోత్సవాలు**

**చెన్నూరు :** లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భముగా ప్రజల మనోభావాలకనుగుణంగా ప్రజా సంక్షేమమే ప్రజాపరిపాలనే ధ్యేయంగా పనిచేస్తున్న లోక్‌సత్తా పార్టీ. ఉద్దేశ్యాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు ఆవిర్భావ దినోత్సవమును పురస్కరించుకొని ''వారోత్సవములు'' నిర్వహించడం జరిగింది.

**ఈ వారోత్సవాలలో**

- పార్టీ ఉద్దేశ్యాలు, లక్ష్యాలను వివరించడం.
- సామాజిక అభివృద్ధి, చైతన్య దిశగా ప్రజలను మేల్కొలపడం.
- స్వార్థ రాజకీయాలను ఎండగట్టటం.
- పార్టీ సభ్యత్వమును పెంపొందించుకొని గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పటిష్టపరచటం.
- మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయుటకు సభ్యులను సంసిద్ధులుగా చేయుట వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

తూర్పు జిల్లా ప్రాంతములో భాగంగా చెన్నూర్, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, ఆసిఫాబాద్ నియోజక వర్గాలలో ఈ కార్యక్రమములను నిర్వహించారు. తేది : 3-10-2010 నుండి 9-10-2010 వరకు జిల్లాలో జరిపి 11-10-2010 హైద్రాబాద్ సమావేశానికి దాదాపుగా 500 మందితో వెళ్ళడం జరిగింది. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాలలో లోక్‌సత్తా, మహిళాసత్తా, యువసత్తా, విద్యార్థిసత్తా నాయకులు శ్రీమతి మేకల సరోజ (తూర్పుజిల్లా అధ్యక్షురాలు) ఎమ్.రమాదేవి (మహిళాసత్తా) మల్లేష్, రాజేష్ (యువసత్తా) కొడిపల్లి సతీష్, ఎం.పున్నం, కె. సంపత్, టి.సంతోస్, మల్లేష్ (విద్యార్థిసత్తా) పాల్గొన్నారు.

## గుంటూరు

**అవినీతిపై లోక్‌సత్తా యుద్ధభేరి**

**నరసరావుపేట :** రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిపాలనా రంగాల్లో ప్రబలుతున్న అవినీతిపై లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో వచ్చే నెల నవంబర్ నుండి నిర్వహించే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ నాయకులు శివరమేష్ రెడ్డి, డాక్టర్ నారాయణం రాధాదేవిలు కోరారు. లోక్‌సత్తా పార్టీ వార్షిక సర్వసభ్య సమావేశం అరండల్‌పేట లోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు ఈదర గోపిచంద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాల్లో ప్రజా సమస్యలపై అధికారులను ఆహ్వానించి ప్రజల ఎదుట ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తూ





మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. గుంటూరు పట్టణ పార్టీ అధ్యక్షులు డాక్టర్ తోటకూర శరత్‌బాబు మాట్లాడుతూ నరసరావుపేటలో పార్టీ అభివృద్ధికి స్థానిక నేతలు చేస్తున్న కృషికి అభినందనగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నరసరావుపేటకు వస్తారని ప్రకటించారు. పార్టీ సీనియర్ నేతలు డాక్టర్ ముక్కామల ఉమామహేశ్వరరావు, ఆళ్ళ సుబ్బారెడ్డిలను పార్టీ నేతల పక్షాన ప్రముఖ వైద్యులు డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి ఘనంగా సన్మానించారు. తొలుత సీనియర్ నాయకులు చుండూరి సత్యనారాయణ, ఆర్.సీతా రామారావులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా మహిళాసత్తా జిల్లా అధ్యక్షులు కె. లలిత కుమారి, జి. నిర్మలాబోస్‌లు మాట్లాడుతూ మద్యంతోపాటు మైక్రోఫైనాన్స్ రుణ బాధితుల పక్షాన కూడా తాము పోరాడతామన్నారు. డాక్టర్ కారసాని మాట్లాడుతూ తన స్వంత గ్రామం సంతమాగులూరులో మద్యం షాపులను మూయించి ఫ్యాక్షన్ తగాదాలను నివారించి శాంతి నెలకొల్పాలన్నారు. మహాత్మాగాంధీ ఆశయాలను ఊరూరా అమలుచేసేందుకు డాక్టర్ కారసాని, డాక్టర్ ముక్కామల ఒక్కొక్కరు పార్టీకి రూ.10 వేలు విరాళాలను ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి కె.ఆర్. ప్రసన్నకుమార్ వార్షిక నివేదికను, బి. విజయశ్రీ మహిళాసత్తా నివేదికను, డి.పోతురాజు ఆర్థిక నివేదికలను సభకు సమర్పించారు.

## పట్టణ అధ్యక్షులుగా గోపీచంద్ ఎంపిక

పార్టీ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో 2010-11 సంవత్సరానికి ఈదర గోపీచంద్‌ను మళ్ళీ పార్టీ పట్టణ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అలాగే కటకం చినపేరిరెడ్డి నూతన ప్రధాన కార్యదర్శిగాను, మరో 17 మంది వ్యక్తులతో కార్యవర్గ కమిటీని ఎంపిక చేశారు. ఈ సమావేశంలో పూజల హనుమంతరావు, అత్తలూరి బాల భాస్కర్, వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను మానండి.. ఖాదీ బ్యాగులనే వాడండి

**నరసరావుపేట :** ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వాడటం మానివేసి ఖాదీబ్యాగులనే వాడాలని మున్సిపల్ కమీషనర్ కె. రామ్మోహనరావు కోరారు. లోక్‌సత్తా నేతలు అందించిన ఖాదీబ్యాగులను తన కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమీషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిర్మూలనకు మున్సిపల్ అధికారులు నడుంబిగించాలన్నారు. గాంధీ స్మారక సమితిలాంటి స్వచ్ఛంధ సంస్థలు ఉద్యమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఎన్‌సివి నేత నల్లపాటి రాము మాట్లాడుతూ నూలు సంచుల వినియోగం వలన చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించినట్లుగా ఉంటుందని పర్యావరణాన్ని కాపాడినట్లుగా ఉంటుందన్నారు. గోపీచంద్ మాట్లాడుతూ భూమాత మన అవసరాలను తీరుస్తుండగా దానికి ప్రతిఫలంగా భారమైన ప్లాస్టిక్ బ్యాగులను వాడాలని చూసి పర్యావరణానికి విఘాతం కలిగించటం మానవుల ఉనికికే ప్రమాదకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అత్తలూరి బాల భాస్కర్, పాత వెంకటేశ్వర్లు, ఘంటా నిర్మలాబోస్, జ్యోత్స, వాణి తదితర లోక్‌సత్తా నేతలు పాల్గొన్నారు.

## మొదటి స్వచ్ఛంద రైతు గ్రూపు ఏర్పాటు

**నరసరావుపేట :** నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని గ్రామాల రైతులు స్వచ్ఛంద రైతు గ్రూపులుగా ఏర్పడి, లోక్‌సత్తా పార్టీచే శిక్షణను అందుకోవడానికి ముందుకు రావాల్సిందిగా పార్టీ నేతలు ఈదర గోపీచంద్, కె. లలితకుమారి, చినపేరిరెడ్డి, వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మంగళవారం పిడుగురాళ్ళల్లో లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకురాలు డాక్టర్ జయప్రకాష్ నారాయణ నిర్వహించిన రైతు సదస్సుకు నియోజకవర్గంలోని విరెడ్డిపాలెం, ముత్తనపల్లి గ్రామాలకు చెందిన పదిమంది రైతుల బృందాన్ని తొడ్కొని వెళ్ళి కలిశామని తెలిపారు. గ్రామాల్లో పదిమంది చొప్పున ఒక్క గ్రూపుగా, కుల, మత, పార్టీలకు అతీతంగా ఏర్పడి తమకు తెలియపరిస్తే రైతుల ఐక్యతకు, చైతన్యానికి కృషిచేసి, గిట్టుబాటు ధర, రక్షణ కల్పించేవిధంగా పోరాడతామని జెపి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఈ పిలుపుననుసరించి విరెడ్డిపాలెంకు చెందిన పలువురు తొలిసారిగా స్వచ్ఛంద రైతుల గ్రూపును ఏర్పరచి, హైదరాబాదులోని పార్టీ కార్యాలయానికి వివరాలను పంపిస్తున్నామని తెలిపినట్లు చెప్పారు. త్వరలో రైతులకు సూచనలిచ్చే విధంగా ఉచిత టోల్‌ఫ్రీ నంబర్‌ను లోక్‌సత్తా పార్టీ ప్రకటిస్తుందని వారు పేర్కొన్నారు.

# శ్రీకాకుళం



## పట్టణ రోడ్లపై వెళ్ళగలమా?

**పాత శ్రీకాకుళం :** గడిచిన దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలోని రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతినడంతో పట్టణ రవాణా వ్యవస్థ అత్యంత దయనీయ స్థితికి చేరుకుందని యువసత్తా జోనల్ కో-ఆర్డినేటర్ పంచాది రాంబాబు ఆవేదన వ్యక్తం చేసారు. నవంబర్9న జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన యువసత్తా కార్యక్రమంలో పాల్గొని పట్టణ సమస్యలపై చర్చించారు. మెరుగైన పారిశుద్ధ్యం అందించడంలో భాగంగా మురికినీటి కాల్వల నిర్వహణలో, చెత్తలు తొలగింపులో పాలకుల అలసత్వం కారణంగా నేడు వర్షాలకు మురికి నీటి కాల్వలు పొంగి రోడ్లపైన, ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయన్నారు. రోడ్లన్నీ మురుగు నీటితో నిండిపోవడంతో ప్రచలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన ఆందోళన వక్తం చేసారు. త్వరలో యువసత్తా ఆధ్వర్యంలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు హరనాథ్, వి. వెంకటస్వామి, బి. రాజు, పి. ధనుంజయ, బి. వెంకట్, చంద్రబోస్, జ్యోతిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిక్లినిక్‌లు ఏర్పాటు చేయాలి

**పాత శ్రీకాకుళం :** వర్షాలు సమృద్ధిగా పడడంతో సాగు విస్తీర్ణం పెరుగుతుండడంతో రైతుల కోసం అగ్రిక్లినిక్‌లు ఏర్పాటు చేయాలని యువసత్తా జోనల్ కో-ఆర్డినేటర్ పంచాది రాంబాబు కోరారు. సాగు విస్తీర్ణం పెరుగుతుందన్న కనీస ముందు చూపు లేకపోవడంతో ఎరువుల కొరతను నివారించడంలో విఫలమైన ప్రభుత్వం ఎరువులు బ్లాక్‌మార్కెట్‌లకు తరలకుండా అడ్డుకోవడంలో విఫలమవుతున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇంత వరకు భూ సార పరీక్షలని నిర్వహించి రైతులకు తగిన సాంకేతిక సమాచారాన్నిచ్చే వ్యవస్థను అమలు చేయకపోవడంతో యూరియా, ఫాస్ఫేట్ వంటి ఎరువులను అవసరానికి మించి వాడడం వలన కూడా ఎరువులకు డిమాండ్ ఏర్పడుతుందన్నారు.



## గిరిజనం గుండెల నుంచి ఉద్యమం

**సీతంపేట :** కన్నెధార కొండలతో తమ జీవితాలు ఎంతగా ముడిపడి ఉన్నాయో గిరిజనులు చెబుతున్న తీరు లోక్‌సత్తా నేతలను కదిలించింది. పట్టెడన్నం పెడుతున్న ఆ కొండలను మంత్రి ధర్మాన కోసం వదులుకోలేమంటూ కొత్తూరు మండలం కంటమానుగూడకు చెందిన సవర లక్ష్మి, నీలమ్మ, డిగ్రీ విద్యార్థులు ఎస్. రామకృష్ణ, సంజీవరావు, ఆవేదనతో చెప్పారు. భర్త చనిపోయినప్పటికీ తన ఐదుగురు పిల్లలకు కన్నెధార కొండల నుంచి సేకరిస్తున్న కట్టెలను విక్రయించి పెంచుతున్నానంటూ నీలమ్మ, తాతల కాలం నుంచి వస్తున్న వ్యవసాయంతోనే బతుకుతున్నామంటూ రామకృష్ణ పేర్కొన్నారు. అక్టోబరు2న సీతంపేటలోని ఆందోళనకారుల నిరసన శిబిరాన్ని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ డి. విష్ణుమూర్తి యువసత్తా జోనల్ సమన్వయకర్త పి. రాంబాబు, ఉపాధ్యక్షుడు బి. గౌరీశంకర్, కార్యవర్గ సభ్యులు పి.జీవరత్నం, వి. జగత్‌రామ్ సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనుల అంతరంగాలను తెలుసుకునే ప్రయత్నం చేసిన ప్రొఫెసర్ విష్ణుమూర్తి ఎటువంటి రాజకీయ పక్షాల ప్రేరణ లేకుండా భూమి కోసం, భుక్తి కోసం వీరు మంత్రి ధర్మానపై వీరోచితంగా ఉద్యమిస్తున్నారని ప్రశంసించారు. తమ పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ ఆదేశాలపై ఇక్కడకు వచ్చామన్నారు. ఇక్కడి వాస్తవాలన్నీ ఆయన దృష్టికి తీసుకెళ్తామని త్వరలోనే ఆయన ఇక్కడ పర్యటిస్తారని వివరించారు. మంత్రి ధర్మాన రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన పదవిని దుర్వినియోగం చేశారని, పుత్రోత్సాహంతో అధికారులను పావులుగా వినియోగించారని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆయన సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. కన్నెధార కొండలను లోక్‌సత్తా బృందం పరిశీలించింది. మన్యసీమ రాష్ట్ర కన్వీనరు ఎం.సింహాచలం, పులిపుట్టి సర్పంచి ముఖలింగం, వెలుగు అసోసియేషన్ కార్యదర్శి సంజీవరావులు పాల్గొన్నారు. ★















RNI.Reg. No. APTEL/2010/32219

Postal Reg. No. HD/1126/2010-12



కర్నాటక రాష్ట్రం సింధనూరులో అశేషంగా తరలివచ్చిన రైతు
సోదరులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ

To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC "X" Roads, Hyderabad